
TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

ప్రతి క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 సంచిక: 87 హైదరాబాద్ బుధవారం 16-09-2026 పేజీలు: 08



## 22ఏపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు
- పొంగులేటి వ్యాఖ్యలకు కౌంటర్
- అసెంబ్లీలో మంత్రి తప్పుదోవ పట్టించారని ఆరోపణ
- హైదర్‌నగర్‌లోని 145, 163 సర్వే నంబర్లపై వివాదం
- భూమికి రిజిస్ట్రేషన్లు కావడం లేదన్నది అవాస్తవమని వెల్లడి
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రిజిస్ట్రేషన్లు జరిగాయని వ్యాఖ్య
- 22ఏ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్
- అసెంబ్లీలో ఆధారాలతో నిరూపిస్తానని సవాల్
- తాను చెప్పేవి అబద్ధాలైతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటన
- 22ఏపై అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయని వెల్లడి



2

పసుపు నీళ్లతో శుద్ధి చేసిన వారిని

## అరెస్ట్ చేయొద్దు

- కేసీఆర్ ఫాంహౌస్ శుద్ధి ఘటనపై హైకోర్టు కీలక తీర్పు
- పసుపు నీళ్లతో శుద్ధి చేసిన వారిని అరెస్ట్ చేయొద్దని ఆదేశం
- కేసీఆర్ ఫాంహౌస్ వ్యవహారంపై లంచ్ మోషన్ పిటిషన్ విచారణ
- నిందితులకు నోటీసులు ఇచ్చి దర్యాప్తు చేయాలని స్పష్టీకరణ
- ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్లపై అరెస్ట్ ఎలా చేస్తారని ప్రశ్న
- సుప్రీంకోర్టు మార్గదర్శకాలను గుర్తుచేసిన హైకోర్టు
- అరెస్ట్ చేయొద్దని చెప్పినా మళ్లీ ఎలా అరెస్ట్ చేస్తారని ఆగ్రహం
- అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఆందోళనతో వివాదానికి తెర
- స్పీకర్‌పై వ్యాఖ్యలకు నిరసనగా ఫాంహౌస్ వద్ద కాంగ్రెస్ నేతల నిరసన
- అనంతరం పసుపు నీళ్లతో ఫాంహౌస్ ప్రాంతాన్ని శుద్ధి చేసిన బీఆర్ఎస్ శ్రేణులు
- ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశాలు




## పంతాలకు పోవద్దు.. పదోన్నతులు కోల్పోవద్దు

- 37 మంది డీఎస్పీలకు పదోన్నతులు
- కోర్టు కేసులతో నిలిచిన ప్రక్రియ
- కేసులు ఉపసంహరించుకోవాలని సూచన
- సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధం

## నా పీఆర్‌ఓ, పీఏపై 15 మంది గూండాలు దాడి చేశారు


5

- సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో ముసుగులు ధరించిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారన్న కేటీఆర్
- పీఎస్ బయట, లోపల ఉన్న సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని డిమాండ్
- రేవంత్ పాలనతో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని మండిపాటు



## 22ఏ భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- తెలంగాణలో 22ఏ భూములతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు
- 22ఏపై అసెంబ్లీలో చర్చ ఎందుకు జరగలేదని ప్రభుత్వాన్ని ప్రశ్న
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పూర్తి వివరాలతో రాలేదని విమర్శ
- 22ఏలో ఉన్న 47,440 ఎకరాలను ఎక్కడ తొలగించారో చెప్పాలని డిమాండ్
- కోటి ఎకరాలకు పైగా భూమి 22ఏలో ఎలా చేరిందని నిలదీత
- భూములు చేర్చిన అధికారులపై చర్యలు తీసుకున్నారా అని ప్రశ్న
- 22ఏ భూముల సమస్యపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో కమిటీ వేయాలని సూచన
- అసైన్డ్ భూములపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం): తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మెదక్ మిగతా 2 లో..



తెలుగు రాష్ట్రాలకు

## 5 లక్షల ఇళ్లు

- ఏపీకి 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షలు
- తెలుగు రాష్ట్రాలకు కేంద్రం భారీగా ఇళ్ల కేటాయింపు
- ఏపీకి 3 లక్షలు.. తెలంగాణకు 2 లక్షల ఇళ్లు
- 2024 తర్వాత అదనంగా ఇళ్ల మంజూరు
- ఏపీకి అదనంగా 2.25 లక్షల ఇళ్లు
- తెలంగాణకు అదనంగా 1.25 లక్షల ఇళ్లు
- తెలుగు రాష్ట్రాలకు ఇదే తొలిసారి భారీ కేటాయింపు
- ఇంటి నిర్మాణానికి కేంద్రం నుంచి రూ.1.20 లక్షలు
- అదనపు సాయంతో రూ.1.80 లక్షల వరకు లబ్ధి
- మరుగుదొడ్డికి రూ.12 వేల ఆర్థిక సాయం
- 2-3 ఏళ్లలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడమే లక్ష్యం

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం): తెలుగు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం భారీగా ఇళ్లను కేటాయించింది. ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. 2024లో కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేసిన కేటాయింపులతో పోలిస్తే.. ఏపీకి అదనంగా 2.25 లక్షలు, తెలంగాణకు అదనంగా 1.25 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. గ్రామీణాభివృద్ధి శాఖ మిగతా 2 లో..

## 22ఏ జాబితాపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్

- జూబ్లీహిల్స్ ఎంసీఆర్ హెచ్ ఆర్ డీ లో ఉన్నతాధికారులతో భేటీ
- 22ఏపై బుధవారం అసెంబ్లీలో చర్చకు సన్నాహాలు
- 22ఏ జాబితాపై అధికారుల పవర్‌పాయింట్ ప్రజంటేషన్
- సమీక్షకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరు పాల్గొన్న మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, వివేక్
- సీఎస్ సంజయ్ జాజుతో పాటు రెవెన్యూ అధికారులు హాజరు
- రాజీవ్ యువ వికాసం తొలి విడత సాయం నవంబర్ 19 నుంచి
- రూ.లక్షలోపు స్వయం ఉపాధి యూనిట్లకు ఆర్థిక సాయం
- ఎస్సీ గురుకులాల్లో రూ.25 కోట్లతో మెకనైజ్డ్ కిచెన్లు



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం): రెవెన్యూ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్ హెచ్ ఆర్ డీ లో ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. బుధవారం అసెంబ్లీలో 22ఏ నిషేధిత భూములపై చర్చించాల్సిన అంశాలపై ఈ సందర్భంగా సమీక్షించారు. 22ఏ జాబితాపై రెవెన్యూ శాఖ అధికారులు సీఎంకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వివేక్, సీఎస్ సంజయ్ జాజుతో పాటు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**నవంబర్ 19 నుంచి రాజీవ్ యువ వికాసం సాయం**

మరోవైపు ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో సమీక్ష నిర్వహించారు. 'రాజీవ్ యువ వికాసం' తొలి విడత సాయాన్ని నవంబర్ 19 నుంచి అందించనున్నట్లు తెలిపారు. రూ.లక్ష లోపు స్వయం మిగతా 2 లో..

## సెప్టెంబర్ 18లోగా హామీలు నెరవేర్చాలి..

- సీఎం రేవంత్‌కు టీఆర్ఎస్ చీఫ్ కవిత అల్టిమేటం
- ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై టీఆర్ఎస్ సదస్సు
- హామీలు నెరవేర్చకుంటే హైదరాబాద్ దిగ్బంధానికి పిలుపు
- ఉద్యోగులు ప్రభుత్వానికి బానిసలు కాదన్న కవిత
- ఉద్యోగులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శ
- డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్
- ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని కోరిన కవిత
- 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్
- ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ కార్డుపై సీఎం రేవంత్‌కు సవాల్
- 2003లో నియమితులైన వారికి ఓపీఎస్ ఇవ్వాలని విజ్ఞప్తి
- ఉద్యోగుల ఆందోళనలకు టీఆర్ఎస్ నైతిక మద్దతు

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం): ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను సెప్టెంబర్ 18లోగా నెరవేర్చాలని సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అల్టిమేటం ఇచ్చారు. ప్రభుత్వం స్పందించకపోతే హైదరాబాద్ దిగ్బంధానికి సిద్ధం కావాలని ఉద్యోగ సంఘాలకు పిలుపునిచ్చారు. వారి పోరాటానికి టీఆర్ఎస్ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై టీఆర్ఎస్ ఏర్పాటు చేసిన సదస్సులో కవిత మాట్లాడారు.

**ఉద్యోగులు బానిసలు కాదు**

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రభుత్వానికి బానిసలు కాదని కవిత అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని అడిగితే వారిని బెదిరిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. మాట తప్పడం, మడమ తిప్పడమే రేవంత్‌రెడ్డి ట్రేడ్‌మార్క్ అంటూ విమర్శించారు.

**ఉద్యోగుల సహకారం అవసరం**

ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన పాలన అందించాలంటే మిగతా 2లో..



రేవంత్‌తో నాకు ఎక్కడా

## గొడవ జరగలేదు

- టీపీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల ప్రయాణం ఉత్సాహంగా సాగింది
- బూత్ స్థాయి వరకు కాంగ్రెస్‌ను బలోపేతం చేశాం
- రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం
- రేవంత్‌తో ఎలాంటి గ్యాప్ లేదు
- భిన్నాభిప్రాయాలు సహజమే.. సాయంత్రానికే సరిచేసుకున్నాం
- పార్టీ విషయంలో సీఎం ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు
- తెలంగాణలో కుల సర్వేతో నిజమైన సామాజిక న్యాయం
- కుల సర్వేను కేంద్రం తొక్కిపెట్టడం దురదృష్టకరం
- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా కుల సర్వే
- క్రమశిక్షణ తప్పితే ఎవరిపైనైనా చర్యలు తప్పవు



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం): టీపీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల ప్రయాణం ఎంతో ఉత్సాహంగా సాగిందని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం మీడియాతో చిట్‌చాట్‌గా ఆయన మాట్లాడారు. బూత్ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేశామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ మిగతా 2లో..

దేశం కోసం ఏం చేశామని

## ప్రశ్నించుకోవాలి

- జెన్‌జీ, జెన్ ఆల్ఫా యువత నాయకత్వంలోకి రావాలి
- యువత ఆశయాలను వినేందుకు దేశం సిద్ధంగా ఉంది
- యువత ముందుకు రావాలని నిర్మలా సీతారామన్ పిలుపు
- దేశ ప్రయోజనాల విషయంలో రాజీ పడొద్దని సూచన
- మన చుట్టూ ఏం జరుగుతుందో ఆలోచించాలని హితవు
- దేశం సురక్షితంగా, బలంగా ఉంటేనే మనకు భద్రత
- ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఘర్షణలతో అనిశ్చితి
- రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో సరఫరాలపై ప్రభావం
- అయినా భారత్ 7.8 శాతం వృద్ధిరేటు సాధించిందని వెల్లడి



న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం): జెన్‌జీ, జెన్ ఆల్ఫా తరాలకు చెందిన యువత నాయకత్వ బాధ్యతలు స్వీకరించేందుకు ముందుకు రావాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పిలుపునిచ్చారు. యువత ఆశయాలను వినడానికి దేశం సిద్ధంగా ఉందని తెలిపారు. దేశం తమకు ఏం చేసిందని ప్రశ్నించకుండా.. మిగతా 2లో..



## యూపీఐ లావాదేవీలపై చార్జీలు ఎందుకు?

- పేదల జేబులకు చిల్లు పెడతారా?
- రూ.2 వేలకుపైబడిన యూపీఐ లావాదేవీలపై ఛార్జీలకు మార్గం సుగమం చేశారా?
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- యూపీఐ ఛార్జీలపై కేంద్రం నోటిఫికేషన్‌ను ప్రశ్నించిన కాంగ్రెస్
- రూ.2 వేల వరకు యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు లేవని కేంద్రం స్పష్టత
- అమెరికా పేమెంట్ కంపెనీల ఒత్తిడికి మోదీ ప్రభుత్వం తలొగ్గుతోందని ఆరోపణ
- యూపీఐ లావాదేవీల్లో విలువ పరంగా 65 శాతం రూ.2 వేలకుపైనే
- జీరో ఎండీఆర్ విధానాన్ని అమెరికా కంపెనీలు వ్యతిరేకిస్తున్నాయని వెల్లడి
- వాణిజ్య ఒప్పందం విషయంలోనూ కేంద్రం రాజీపడిందని విమర్శ
- ద్రవ్యోల్బణంతో సామాన్యుడి జేబులు ఖాళీ అవుతున్నాయని వ్యాఖ్య
- డిజిటల్ చెల్లింపుల పన్నుపై నివేదికలను ప్రస్తావించిన కాంగ్రెస్
- పెద్ద నోట్ల రద్దు తర్వాత ఇచ్చిన హామీలను గుర్తుచేసిన ఖర్గే, రాహుల్

న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం): రూ.2 వేల వరకు ఉండే యూపీఐ లావాదేవీలపై బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు ఛార్జీలు వసూలు చేయరాదంటూ కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌పై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. రూ.2 వేలకుపైబడిన యూపీఐ లావాదేవీలపై ఫీజులు విధించేందుకు కేంద్ర ప్రభుత్వం నిశ్శబ్దంగా మార్గం సుగమం చేస్తోందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత మిగతా 2లో..

## 22ఏ జాబితాపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్

**మొదటిపేజీ తరువాయి**

ఉపాధి యూనిట్లకు తొలి విడత ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు.

**ఎస్సీ గురుకులాల్లో మెకనైజ్డ్ కిచెన్లు**

ఎస్సీ గురుకులాల్లో కేంద్రీకృత యంత్రాలతో వంటశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. మెకనైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు రూ.25 కోట్ల నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. 15 రోజుల్లో కేంద్రీకృత వంటశాలల ఏర్పాటుపై కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఎస్సీ గురుకులాల పూర్వ విద్యార్థుల సమగ్ర డేటాబేస్ రూపొందించాలని, వారి స్థితిగతులపై సీఈఎస్ఎస్‌తో సమగ్ర అధ్యయనం చేపట్టాలని సూచించారు. స్టడీ సర్కిళ్ల పనితీరుపై నివేదిక ఇవ్వాలని, ఎస్సీ డిగ్రీ కళాశాలల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు. 26 ఏకలవ్య పాఠశాలల నిర్మాణ ప్రతిపాదనలను కేంద్రానికి పంపినట్లు అధికారులు భట్టి విక్రమార్కకు వివరించారు. ఈ సమీక్షకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్, సంక్షేమ శాఖ అధికారులు హాజరయ్యారు.

## 22ఏ భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. 22ఏ భూములపై అసెంబ్లీలో చర్చ జరుగుతుందని ప్రజలు భావించారని.. కానీ అలా ఎందుకు జరగలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన.. గుడులు, బడులు, దేవస్థానాల భూములు, ప్రభుత్వ భూములు రిజిస్టర్ చేయకుండా 22ఏ చట్టం తీసుకొచ్చారని వివరించారు. 22ఏ అంశంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీకి తగినంతగా సిద్ధమై రాలేదని రఘునందన్‌రావు విమర్శించారు. 22ఏ గురించి ఎవరైనా మాట్లాడితే వారందరినీ ఒకే గాటన కట్టడం సరికాదన్నారు. తన పార్లమెంట్ పరిధిలోని సింఫనీ హోంలో రిజిస్ట్రేషన్ల సమస్య ఉండటంతో తాను ఈ అంశంపై మాట్లాడాల్సి వచ్చిందని చెప్పారు.

**47,440 ఎకరాలపై ప్రశ్న**

22ఏలో ఉన్న 47,440 ఎకరాల భూమిని ఎక్కడ.. ఏ గ్రామంలో తొలగించారో మంత్రి పొంగులేటి సమాధానం చెప్పాలని రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో 22ఏలో చేర్చిన భూములను తొలగించామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందని.. అయితే ఆ భూములను 22ఏలో చేర్చిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

22ఏలో కోటి ఎకరాలకు పైగా భూమి ఉందని చెబుతున్నారని.. ఇంత భారీ మొత్తంలో భూమి ఎలా 22ఏలోకి వచ్చింది, ఇప్పుడు ఎలా తొలగిస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. పేదలకు అన్యాయం చేసిన అధికారులు, కలెక్టర్లపై చర్యలు తీసుకున్నారా లేదా చెప్పాలని డిమాండ్ చేశారు.

**సిట్టింగ్ జడ్జితో కమిటీ వేయాలి**

22ఏలో ఉన్న సుమారు కోటి రెండు లక్షల ఎకరాల భూమిని ఎప్పటిలోగా తొలగిస్తారో ప్రభుత్వం స్పష్టమైన గడువు ప్రకటించాలని రఘునందన్‌రావు కోరారు. ఈ సమస్య పరిష్కారానికి తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జితో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.

**అసైన్డ్ భూములపై శ్వేతపత్రం**

భూ భారతి అమల్లోకి వచ్చిన తర్వాత కూడా తప్పులు జరిగాయని మంత్రి పొంగులేటి అంగీకరించారని రఘునందన్‌రావు అన్నారు. పేదలకు అన్యాయం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధరణి, భూ భారతి తీసుకొచ్చిన రెండు పార్టీలపైనా ప్రజలకు నమ్మకం లేదని విమర్శించారు.

రాష్ట్రంలో ఎన్ని అసైన్డ్ భూములు ఉన్నాయో ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. భూ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని అన్నారు. రాష్ట్రంలో నమోదైన భూ సంబంధిత కేసులపై రాష్ట్ర ప్రభుత్వమే దర్యాప్తు చేయాలని.. ప్రతిదానికీ కేంద్రం జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని రఘునందన్‌రావు ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కమిటీల పేరుతో కాలయాపన చేయబోమని ఆయన పేర్కొన్నారు.

## తెలుగు రాష్ట్రాలకు 5 లక్షల ఇళ్లు

**మొదటిపేజీ తరువాయి**

నుంచి తెలుగు రాష్ట్రాలకు ఇంత పెద్ద మొత్తంలో ఇళ్లను కేటాయించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు.

**ఏపీకి భారీగా పెరిగిన కేటాయింపులు**

201924 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్‌కు 1.78 లక్షల ఇళ్లు కేటాయించగా.. అందులో కేవలం 42 వేల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రానికి 3 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు.

**తెలంగాణకు అడిగిన దానికంటే ఎక్కువ**

201924 మధ్యకాలంలో తెలంగాణ గ్రామీణ ఆవాస యోజన పథకంలో చేరలేదని పెమ్మసాని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి రెండు, మూడు సార్లు ఇళ్ల కేటాయింపు కోసం కేంద్రాన్ని కోరారని చెప్పారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అడిగిన దానికంటే ఎక్కువగానే 2 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

**ఇంటి నిర్మాణానికి రూ.1.20 లక్షలు**

ప్రధాన మంత్రి ఆవాస్ యోజనగ్రామీణ పథకం కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్రం తరపున రూ.1.20 లక్షల ప్రాథమిక ఆర్థిక సాయం అందుతుందని మంత్రి తెలిపారు. ఇతర అదనపు సాయంతో కలిపి ఒక్కో లబ్ధిదారుడికి దాదాపు రూ.1.80 లక్షల వరకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. స్వచ్ఛ భారత్ పథకం కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందుతుందని చెప్పారు.

**పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక**

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఆవాస్ ప్లస్ యాప్‌ను ఉపయోగిస్తున్నట్లు పెమ్మసాని తెలిపారు. జియో ట్యాగింగ్‌తో లబ్ధిదారుల నమోదుకు కేంద్రం సెల్ఫ్ సర్వే సదుపాయాన్ని కూడా కల్పించిందన్నారు. గ్రామీణ పేదలకు మరింత ప్రయోజనం కల్పించేలా పథకం అర్హత నిబంధనల్లో మార్పులు చేసినట్లు మంత్రి చెప్పారు. ఆదాయ అర్హత పరిమితిని నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచినట్లు తెలిపారు. మోటార్ బైక్, ఫ్రిజ్ ఉన్నంత మాత్రాన అర్హత కోల్పోకుండా నిబంధనలను సవరించినట్లు వివరించారు.

**2-3 ఏళ్లలో నిర్మాణం పూర్తి**

కొత్తగా మంజూరైన ఇళ్లతో పాటు గతంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాన్ని కూడా 23 ఏళ్లలో పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల కేటాయింపు జరుగుతుందని స్పష్టం చేశారు.

## పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయాలి

**మెదక్ సెప్టెంబర్ 15 (ప్రజాక్షేత్రం)**

ఈ నెల 20న కొడంగల్ లో నిర్వహించనున్న పాంచజన్య సంకల్ప సభ పోస్టర్‌ను మెదక్ పట్టణంలోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ బట్టి అజయ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభకు సంబంధించిన కార్యక్రమాల పై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. సభను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని బట్టి అజయ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఇప్పా రమేశ్, కేవల్ నందకిషోర్, టీఆర్ఎస్వీ అధ్యక్షుడు ఎండీ జునైద్, కాసాపురం అశోక్, వేపురి శ్రీనివాస్, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జ్ వైష్ణవ్ రాజ్, దినేశ్, రేహాన్, మల్లేశ్, మోయినుద్దీన్, ప్రేమ్, భూపతూప్పర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.




# సెప్టెంబర్ 18లోగా హామీలు నెరవేర్చాలి..

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వ ఉద్యోగుల సహకారం అవసరమని కవిత తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉపాధ్యాయులు ఉద్యోగం కంటే ఉద్యమమే ముఖ్యమని పోరాడారని గుర్తుచేశారు. ప్రస్తుతం రేవంత్ ప్రభుత్వంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**డీఏ బకాయిలపై విమర్శ**

గత 32 నెలలుగా ఉద్యోగులకు డీఏ ఇవ్వకుండా వారి కరువు భత్యాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మింగేశారని కవిత విమర్శించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉద్యోగులకు డీఏ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల పేరుతో గొప్పలు చెప్పుకుంటున్నా.. వాటిలో ఏ ఒక్కటీ సరిగా అమలు కావడం లేదని ఆరోపించారు.

**51 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలి**

ఉద్యోగుల పీఆర్సీ గడువు ముగిసే పరిస్థితి ఉందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే 51 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులు తమ ప్రయోజనాలు అడిగితే రెండేళ్లు ఆగాలని సీఎం చెబుతున్నారని.. మరో రెండేళ్లు గడిస్తే ఆయన పదవిలో ఉండరని వ్యాఖ్యానించారు.

**317 జీవో బాధితులకు న్యాయం**

317 జీవో బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందని కవిత స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో వారికి న్యాయం చేసేందుకు తాను చేసిన ప్రయత్నాలు ఫలించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 317 జీవో బాధితుల్లో మహిళా ఉద్యోగులే ఎక్కువగా ఉన్నారని తెలిపారు.

**హెల్త్ కార్డుపై సవాల్**

ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హెల్త్ కార్డు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఎక్కడైనా పనిచేస్తుందా? అని సీఎం రేవంత్‌రెడ్డిని కవిత ప్రశ్నించారు. హెల్త్ కార్డు పనిచేస్తే టీఆర్ఎస్ ఏం చేయమన్నా చేస్తుందని, లేదంటే సీఎం రాజీనామా చేస్తారా? అని సవాల్ విసిరారు.

**ఓపీఎస్ అమలు చేయాలి**

2003లో నియమితులైన పోలీసులకు ఓపీఎస్ ఇవ్వలేదని కవిత తెలిపారు. అదే ఏడాది నియమితులైన ఉపాధ్యాయులకు కూడా ఓపీఎస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారికి ఓపీఎస్ అమలు చేస్తే ప్రభుత్వానికి రూ.2 వేల కోట్లు ఆదా అవుతాయని పేర్కొన్నారు.

**ఉద్యోగ సంఘాలకు సూచన**

ప్రభుత్వంపై పోరాటం విషయంలో ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు భయపడాల్సిన అవసరం లేదని కవిత అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కాంగ్రెస్‌తోనే పోరాడామని గుర్తుచేశారు. దాదాపు 206 ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు జేఏసీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నాయని తెలిపారు. ఉద్యోగుల ఆందోళనలకు తాము సంయమనంతో నైతిక మద్దతు ఇస్తున్నామని చెప్పారు.

**అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి**



అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించాలని కవిత డిమాండ్ చేశారు. జీతాలు సకాలంలో రాకపోయినా ప్రజలకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో వారు పనిచేస్తున్నారని అన్నారు. వారికి బకాయి పడిన జీతాలను వెంటనే చెల్లించాలని కోరారు.

## 22ఏపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- **కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు**
- **పొంగులేటి వ్యాఖ్యలకు కౌంటర్**
- **అసెంబ్లీలో మంత్రి తప్పుదోవ పట్టించారని ఆరోపణ**
- **హైదర్‌నగర్‌లోని 145, 163 సర్వే నంబర్లపై వివాదం**
- **భూమికి రిజిస్ట్రేషన్లు కావడం లేదన్నది అవాస్తవమని వెల్లడి**
- **కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రిజిస్ట్రేషన్లు జరిగాయని వ్యాఖ్య**
- **22ఏ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్**
- **అసెంబ్లీలో ఆధారాలతో నిరూపిస్తానని సవాల్**
- **తాను చెప్పేవి అబద్ధాలైతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటన**
- **22ఏపై అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయని వెల్లడి**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో తన గురించి చేసిన ప్రస్తావనపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పందించారు. హైదర్‌నగర్‌లోని 145, 163 సర్వే నంబర్లలో ఉన్న భూమికి చాలా ఏళ్లుగా రిజిస్ట్రేషన్లు జరగడం లేదంటూ మంత్రి అసెంబ్లీలో తప్పుదోవ పట్టించేలా మాట్లాడారని ఆరోపించారు.

**ఏడాదిపాటు రిజిస్ట్రేషన్లు జరిగాయి**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సదరు భూములకు ఏడాదిపాటు రిజిస్ట్రేషన్లు జరిగాయని కృష్ణారావు తెలిపారు. చాలా ఏళ్లుగా రిజిస్ట్రేషన్లు జరగడం లేదన్న మంత్రి వ్యాఖ్యల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు.

**22ఏపై సిట్టింగ్ జడ్జితో విచారణ**

22ఏ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం విచారణకు అవకాశం కల్పిస్తే వాస్తవాలను ఆధారాలతో సహా వెల్లడిస్తానన్నారు.

**అబద్ధమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటా**

తనకు అసెంబ్లీలో మాట్లాడే అవకాశం కల్పిస్తే 22ఏ అంశంపై అన్ని ఆధారాలతో నిరూపిస్తానని కృష్ణారావు సవాల్ చేశారు. తాను చెప్పే విషయాలు అబద్ధాలని తేలితే రాజకీయాల నుంచి వైదొలగుతానని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

## యూపీఐ లావాదేవీలపై చార్జీలు ఎందుకు?

**మొదటిపేజీ తరువాయి**

రాహుల్ గాంధీ ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను బుజ్జగించేందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నారా? అని ప్రశ్నించారు.

**5 శాతం లావాదేవీలే.. కానీ విలువలో 65 శాతం**

దేశంలో రూ.2 వేలకు పైబడిన యూపీఐ లావాదేవీల సంఖ్య కేవలం 5 శాతం మాత్రమేనని కాంగ్రెస్ నేతలు తెలిపారు. అయితే మొత్తం లావాదేవీల విలువలో వాటి వాటా సుమారు 65 శాతం ఉంటుందని పేర్కొన్నారు. ఈ లావాదేవీలపై ఛార్జీలు విధించే అవకాశం కల్పించడం ద్వారా పెద్ద మొత్తంలో డిజిటల్ చెల్లింపులపై అదనపు భారం పడుతుందని విమర్శించారు.

**అమెరికా కంపెనీల ఒత్తిడికి తలొగ్గుతున్నారా?**

భారత్‌లో అమలవుతున్న జీరో ఎండీఆర్ విధానాన్ని అమెరికా పేమెంట్ కంపెనీలు ఎప్పటినుంచో వ్యతిరేకిస్తున్నాయని కాంగ్రెస్ పేర్కొంది. ఆ కంపెనీల ఆకాంక్షలకు అనుగుణంగా మోదీ ప్రభుత్వం విధానాలను మార్చుకుంటోందని ఆరోపించింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలో రాజీపడిన ప్రధాని మోదీ.. మరోసారి అమెరికా ఒత్తిడికి లొంగిపోతున్నారని ఖర్గే, రాహుల్ విమర్శించారు.

**ద్రవ్యోల్బణంతో సామాన్యుడిపై భారం**

ఆకాశాన్నంటుతున్న ద్రవ్యోల్బణంతో సామాన్యుల జేబులు ఇప్పటికే ఖాళీ అయ్యాయని కాంగ్రెస్ నేతలు అన్నారు. టోకు ద్రవ్యోల్బణం 10 శాతానికి చేరువలో ఉన్న సమయంలో 'డిజిటల్ చెల్లింపుల పన్ను' విధించడం ద్వారా ప్రజల మిగిలిన పొదుపులను కూడా ప్రభుత్వం దెబ్బతీయాలని చూస్తోందని ఆరోపించారు.

**రూ.5 వేలపై రూ.25.. రూ.10 వేలపై రూ.50?**

రూ.5 వేల లావాదేవీలపై రూ.25, రూ.10 వేల లావాదేవీలపై రూ.50 వరకు పన్ను విధించే అవకాశం ఉందంటూ వచ్చిన నివేదికలను కాంగ్రెస్ ప్రస్తావించింది. ఈ వార్తలు నిజమేనా అని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఎండీఆర్ ద్వారా వ్యాపారులపై పడే అదనపు భారం చివరికి వస్తువుల ధరల పెరుగుదల రూపంలో సగటు వినియోగదారుడిపైనే పడుతుందని పేర్కొంది.

**పెద్ద నోట్ల రద్దును గుర్తుచేసిన కాంగ్రెస్**

పెద్ద నోట్ల రద్దు సమయంలో నగదు రహిత ఆర్థిక వ్యవస్థ, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకే ఆ నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వం చెప్పిందని కాంగ్రెస్ గుర్తుచేసింది. ఇప్పుడు డిజిటల్ చెల్లింపులపైనే అదనపు భారం మోపే ప్రయత్నం చేయడం ఆ విధానానికి విరుద్ధమని విమర్శించింది.

**రోజూ జేబులు ఖాళీ చేసే మార్గాలేనా?**

ద్రవ్యోల్బణంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కల్పించాల్సిన ప్రభుత్వం.. వారి జేబులు ఖాళీ చేయడానికి ప్రతిరోజూ కొత్త మార్గాలను అన్వేషిస్తోందని కాంగ్రెస్ నేతలు దుయ్యబట్టారు. యూపీఐ లావాదేవీలపై ప్రతిపాదిత ఛార్జీల విషయంలో కేంద్రం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

## దేశం కోసం ఏం చేశామని ప్రశ్నించుకోవాలి

**మొదటిపేజీ తరువాయి**

తాము దేశం కోసం ఏం చేశామనే విషయాన్ని ఆలోచించుకోవాలని సూచించారు. తమిళనాడులోని డాక్టర్ ఎం.జి.ఆర్. ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో ఆమె ప్రసంగించారు.

**నాయకత్వంలోకి రావాలి**

తమను జెన్‌జీ, జెన్ ఆల్ఫా అని పిలుచుకున్నా సరే.. యువత చెప్పేది వినడానికి తాము సిద్ధంగా ఉన్నామని నిర్మలా సీతారామన్ అన్నారు. అయితే తమ చుట్టూ ఏం జరుగుతోంది? అందులో తమ పాత్ర ఏమిటి? దేశం కోసం ఏం చేయగలమనే విషయాలపై యువత ఆలోచించాలని సూచించారు. నాయకత్వ బాధ్యతలు స్వీకరించేందుకు ముందుకు రావాలని కోరారు.

**దేశ ప్రయోజనాలే ముఖ్యం**

దేశ ప్రయోజనాల విషయంలో ఎప్పుడూ రాజీపడకూడదని మంత్రి స్పష్టం చేశారు. దేశం సురక్షితంగా, బలంగా ఉంటేనే ప్రజలకు నివసించేందుకు ఒక ఇల్లు, భద్రమైన వాతావరణం ఉంటుందని అన్నారు. ప్రపంచంలోని పలు దేశాల్లో యుద్ధాలు, ఘర్షణల కారణంగా ప్రజలు సొంత ప్రాంతాలను విడిచి నిర్వాసితులుగా మారుతున్న పరిస్థితులను చూస్తున్నామని చెప్పారు. అయితే భారత్‌లో అలాంటి పరిస్థితి లేదన్నారు.

**అనిశ్చితుల మధ్య 7.8 శాతం వృద్ధి**

రష్యాఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణల కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయని నిర్మలా సీతారామన్ తెలిపారు. ముడిచమురు, గ్యాస్, ఎరువుల సరఫరాపైనా ఈ పరిణామాలు ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ భారత్ అన్ని సవాళ్లను ఎదుర్కొని 7.8 శాతం వృద్ధిరేటును నమోదు చేసిందన్నారు.

**యువతకు ఎన్నో అవకాశాలు**

ప్రధాని మోదీ నేతృత్వంలోని బలమైన ప్రభుత్వం దేశంలో స్థిరత్వాన్ని కొనసాగించడానికి కారణమని నిర్మలా సీతారామన్ అన్నారు. యువత కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో అవకాశాలను కల్పిస్తోందని తెలిపారు. జీవితంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలమని చెప్పారు.

## రేవంత్‌తో నాకు ఎక్కడా గొడవ జరగలేదు

**మొదటిపేజీ తరువాయి**

లక్ష్యమని చెప్పారు.

**కుల సర్వేతో సామాజిక న్యాయం**

తెలంగాణలో కుల సర్వే నిర్వహించడం ద్వారా నిజమైన సామాజిక న్యాయం జరిగిందని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కుల సర్వేను కేంద్ర ప్రభుత్వం తొక్కిపెట్టడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే దేశవ్యాప్తంగా కుల సర్వేను అమలు చేస్తామని తెలిపారు.

**రేవంత్‌తో ఎలాంటి గొడవ లేదు**

సీఎం రేవంత్‌రెడ్డితో తనకు ఎక్కడా గొడవ జరగలేదని మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు సహజమేనని చెప్పారు. తమ మధ్య గ్యాప్ ఉందని, గొడవలు జరిగాయని ప్రచారం జరుగుతోందని.. అందులో వాస్తవం లేదన్నారు. సీఎంతో ఎప్పుడైనా అభిప్రాయ భేదాలు వచ్చినా సాయంత్రానికే వాటిని సరిచేసుకున్నామని తెలిపారు.

**పార్టీ విషయంలో జోక్యం లేదు**

పార్టీ వ్యవహారాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీని బలోపేతం చేసే విషయంలో సమన్వయంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

**సురేఖపై చర్యలు ఏఐసీసీ నిర్ణయమే**

బీసీ మంత్రిని తొలగించిన సమయంలో తాను కూడా బాధపడ్డానని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. మంత్రి కొండా సురేఖపై చర్యలు ఏఐసీసీ నిర్ణయం మేరకే తీసుకున్నామని స్పష్టం చేశారు. పార్టీలో క్రమశిక్షణ తప్పితే ఎవరిపైనైనా చర్యలు తప్పవని అన్నారు. క్రమశిక్షణ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఏఐసీసీ నిర్ణయించిందని తెలిపారు.

## నా పీఆర్ఓ, పీఏపై 15 మంది గూండాలు దాడి చేశారు

- **సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో ముసుగులు ధరించిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారన్న కేటీఆర్**
- **పీఎస్ బయట, లోపల ఉన్న సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని డిమాండ్**
- **రేవంత్ పాలనతో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని మండిపాటు**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్ లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్ఓ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసుగులు ధరించిన 15 మంది గుండాలు లోపలికి చొరబడి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని... రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని, అణచివేతకు తలొగ్గని ప్రతీ పౌరుడికీ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే విచారణ పేరుతో ఉదయాన్నే స్టేషన్‌కు పిలిపించి చీకటి పడే వరకు కాలయాపన చేసి ఈ కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ గుండాలు ఈ దాడికి పాల్పడ్డారా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు వేసుకుని వచ్చారా? అనే దానిపై నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని, గాయపడిన తన సిబ్బందికి రక్షణ కల్పించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని 'ఎక్స్' వేదికగా ట్యాగ్ చేస్తూ 'వెల్‌డన్ కాంగ్రెస్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## పసుపు నీళ్లతో శుద్ధి చేసిన వారిని అరెస్ట్ చేయొద్దు

- **కేసీఆర్ ఫాంహౌస్ శుద్ధి ఘటనపై హైకోర్టు కీలక తీర్పు**
- **పసుపు నీళ్లతో శుద్ధి చేసిన వారిని అరెస్ట్ చేయొద్దని ఆదేశం**
- **కేసీఆర్ ఫాంహౌస్ వ్యవహారంపై లంచ్ మోషన్ పిటిషన్ విచారణ**
- **నిందితులకు నోటీసులు ఇచ్చి దర్యాప్తు చేయాలని స్పష్టీకరణ**
- **ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్లపై అరెస్ట్ ఎలా చేస్తారని ప్రశ్న**
- **సుప్రీంకోర్టు మార్గదర్శకాలను గుర్తుచేసిన హైకోర్టు**
- **అరెస్ట్ చేయొద్దని చెప్పినా మళ్లీ ఎలా అరెస్ట్ చేస్తారని ఆగ్రహం**
- **అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఆందోళనతో వివాదానికి తెర**
- **ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశాలు**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

కేసీఆర్ ఫాంహౌస్ వద్ద పసుపు నీళ్లతో శుద్ధి చేసిన వారిని అరెస్ట్ చేయవద్దని తెలంగాణ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ వ్యవహారంపై మంగళవారం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ విచారణకు వచ్చింది. సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇచ్చి దర్యాప్తు కొనసాగించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్ల కింద కేసు నమోదైనప్పుడు వారిని ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం అరెస్ట్ చేయొద్దని చెప్పినా.. మళ్లీ ఎలా అరెస్ట్ చేస్తారని పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది.

**అసెంబ్లీ ఆందోళనతో వివాదం**

సెప్టెంబర్ 7న తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన విఫలమైందంటూ బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, విజయ్‌కుమార్‌రెడ్డి స్పీకర్ జి. ప్రసాద్‌కుమార్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు మూలపాఠంలో పేర్కొన్నారు. దీంతో వారిని శాసనమండలి సమావేశాల్లో పాల్గొనకుండా సస్పెండ్ చేశారు.

**ఫాంహౌస్ వద్ద కాంగ్రెస్ నిరసన**

స్పీకర్‌పై వ్యాఖ్యలకు నిరసనగా ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ వద్ద కాంగ్రెస్ పార్టీకి చెందిన దళిత నేతలు, కార్యకర్తలు నిరసన నిర్వహించారు. అనంతరం ఆ ప్రాంతాన్ని బీఆర్ఎస్ శ్రేణులు పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేశాయి. ఈ చర్యపై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

**అరెస్టులపై హైకోర్టు జోక్యం**

పసుపు నీళ్లతో శుద్ధి చేసిన వారి అరెస్టు వ్యవహారంలో హైకోర్టు జోక్యం చేసుకుంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించాలని సూచిస్తూ.. సంబంధిత వ్యక్తులను అరెస్ట్ చేయకుండా నోటీసులు ఇచ్చి దర్యాప్తు చేయాలని ఆదేశించింది.

# పంతాలకు పోవద్దు.. పదోన్నతులు కోల్పోవద్దు

- **37 మంది డీఎస్పీలకు పదోన్నతులు**
- **కోర్టు కేసులతో నిలిచిన ప్రక్రియ**
- **కేసులు ఉపసంహరించుకోవాలని సూచన**
- **సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధం**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ పోలీస్ శాఖలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డీఎస్పీల పదోన్నతుల అంశంపై కదలిక మొదలైంది. 1991, 1995, 1996 బ్యాచ్‌లకు చెందిన 37 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు రావాల్సి ఉందని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. కోర్టు కేసుల కారణంగా పదోన్నతుల ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతోందని పేర్కొన్న ఆయన.. అధికారులు పంతాలకు పోయి పదోన్నతులు కోల్పోవద్దని సూచించారు.

**37 మంది డీఎస్పీలకు పదోన్నతులు**

1991, 1995, 1996 బ్యాచ్‌లకు చెందిన మొత్తం 37 మంది డీఎస్పీలు అదనపు ఎస్పీలుగా పదోన్నతి పొందాల్సి ఉందని డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ప్రస్తుతం 37 అదనపు ఎస్పీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. వీటిని వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపేలా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

**కోర్టు కేసులతో జాప్యం**

పదోన్నతులకు సంబంధించిన అంశంపై కొందరు అధికారులు కోర్టులను ఆశ్రయించడంతో ప్రక్రియ ముందుకు సాగడం లేదని డీజీపీ తెలిపారు. కేసులు వేసుకోవడం వల్ల చివరకు నష్టపోయేది అధికారులేనని సూచించారు. పదోన్నతుల విషయంలో పంతాలకు పోకుండా అందరూ సహకరిస్తే ప్రక్రియను వేగంగా పూర్తి చేయవచ్చని స్పష్టం చేశారు.

**సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధం**

పదోన్నతుల సమస్యను పరిష్కరించేందుకు తాను ప్రత్యేక చొరవ తీసుకుంటానని సీవీ ఆనంద్ హామీ ఇచ్చారు. అవసరమైతే ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. అధికారులంతా సహకరిస్తే త్వరగా పదోన్నతులు కల్పించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**కేసుల ఉపసంహరణకు అధికారుల సుముఖత**

డీజీపీ చొరవతో వరంగల్ జోన్‌కు చెందిన పలువురు అధికారులు ఇప్పటికే తమ కేసులను ఉపసంహరించుకునేందుకు ముందుకొచ్చారు. 1991, 1995, 1996 బ్యాచ్‌లకు చెందిన అధికారులు కేసుల ఉపసంహరణకు సంబంధించి లేఖ ఇచ్చినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ సిటీకి చెందిన అధికారులు కూడా కేసుల ఉపసంహరణకు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.

**సమస్య పరిష్కారం దిశగా అడుగులు**

ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల అంశంపై డీజీపీ సీవీ ఆనంద్ చొరవతో కదలిక రావడంతో పోలీసు అధికారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. కోర్టు కేసులు ఉపసంహరించుకుని అధికారులు సహకరిస్తే ప్రస్తుతం ఖాళీగా ఉన్న 37 అదనపు ఎస్పీ పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉంది. దీంతో 1991, 1995, 1996 బ్యాచ్‌ల డీఎస్పీల పదోన్నతుల సమస్య త్వరలోనే కొలిక్కి వచ్చే అవకాశం కనిపిస్తోంది.

# బిడ్డ పుట్టాక పెళ్లి సర్టిఫికెట్..... గొట్లపల్లిలో రికార్డుల గందరగోళం!

- **గొట్లపల్లి గ్రామ పంచాయతీలో మ్యారేజ్ సర్టిఫికెట్ వివాదం**
- **వివాహానికి ముందే బిడ్డ జననం.....ఆ తర్వాత పెళ్లి సర్టిఫికెట్!?**
- **ప్రభుత్వ రికార్డుల్లో తేదీల వ్యత్యాసం.. పంచాయతీ కార్యదర్శి పనితీరుపై ప్రశ్నలు**
- **రికార్డుల నమోదు ప్రక్రియపై సమగ్ర విచారణకు డిమాండ్**

**పెద్దేముల్, సెప్టెంబర్ 15(ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలం గొట్లపల్లి గ్రామపంచాయతీలో జారీ చేసిన ఓ మ్యారేజ్ సర్టిఫికెట్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ఒకే కుటుంబానికి సంబంధించిన వివాహ, జనన ధ్రువపత్రాల్లో నమోదైన తేదీల మధ్య వ్యత్యాసం ఉండటంతో అసలు రికార్డుల నమోదు ప్రక్రియ ఎలా సాగిందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ రికార్డుల్లోనే పరస్పర విరుద్ధమైన తేదీలు కనిపించడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తూ సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

**ఒక రికార్డులో మార్చి 02..**
**మరో రికార్డులో జనవరి 30**

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలం గొట్లపల్లి గ్రామానికి చెందిన బంటు అనిల్ కుమార్, మైల్వార్ గ్రామానికి చెందిన ఆకుల నందిని వివాహం 02 032026న జరిగినట్లు గొట్లపల్లి గ్రామపంచాయతీ పేరుతో జారీ చేసిన మ్యారేజ్ సర్టిఫికెట్‌లో నమోదైంది.ఈ సర్టిఫికెట్‌లో సీరియల్ నంబర్ 35గా ఉన్నట్లు సమాచారం. అయితే ఇదే జంటకు సంబంధించిన బిడ్డ 30012026న తాండూరు ప్రభుత్వ మదర్ అండ్ చైల్డ్ ఆసుపత్రిలో జన్మించినట్లు జనన ఈకార్డులో నమోదై ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఈ రెండు రికార్డుల్లోని తేదీలను పరిశీలిస్తే....బిడ్డ జననం జరిగిన తేదీకి సుమారు 32 రోజుల తర్వాత వివాహం జరిగినట్లు మ్యారేజ్ సర్టిఫికెట్‌లో నమోదై ఉంది. దీంతో వివాహ నమోదు ప్రక్రియ, ధ్రువపత్రాల జారీ సమయంలో సంబంధిత రికార్డులను ఎలా పరిశీలించారు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.


**రికార్డుల పరిశీలన జరిగిందా?**

మ్యారేజ్ సర్టిఫికెట్ జారీ చేసే సమయంలో సంబంధిత పత్రాలు, వివరాలు, తేదీలను అధికారులు పరిశీలించారా? ఒకవేళ పరిశీలించి ఉంటే ఇలాంటి తేదీ వ్యత్యాసం ఎలా నమోదైంది? జనన ధ్రువపత్రం, వివాహ ధ్రువపత్రాల్లోని వివరాలు పరస్పరం ఎలా విభిన్నంగా నమోదయ్యాయి? అన్న అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవహారంలో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం నమోదు చేశారా? లేక రికార్డుల నిర్వహణలో పొరపాటు జరిగిందా? అన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.

**అధికారుల విచారణతోనే**
**అసలు విషయం వెలుగులోకి**

ప్రభుత్వ రికార్డుల్లో కనిపిస్తున్న తేదీల వ్యత్యాసంపై సమగ్రంగా విచారణ జరిపి అసలు వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ధ్రువపత్రాల జారీ ప్రక్రియలో నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఎలాంటి తప్పిదం జరగకపోతే రికార్డుల ఆధారంగా స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.




GOVERNMENT OF TELANGANA

SCHEDULE
FORM -A
(See section 12)

MARRIAGE CERTIFICATE

CERTIFICATE No.

I, Panchayat Secretary hereby certify that I have registered under the Compulsory Registration of Marriage Act, 2002, the marriage of bridegroom Sri Bantu Anil kumar S/o Bantu Hanumanthu, R/o Gotlapally with bride Smt Akula Nandini D/o Aakula Narsimulu, R/o Mailwar solemnized on this 02nd March day of 2026 in pursuance of the memorandum dated the day of 02/03/2026 received by me and the same has been entered as Serial No. 35 in Page No. 035 of the Register of Marriages maintained by me for the year.

Date :

District Registrar of Marriages/ Marriage Officer of the Local Area

Address:
Gotlapally (Village/ Municipality)
Peddemul (Mandal)

**ఈ విషయమై పూర్తిస్థాయిలో విచారణ చేస్తాం.**
**పెద్దేముల్ ఎంపీడీఓ కే.తిరుమల స్వామి**

ఈ వ్యవహారంపై పెద్దేముల్ మండల ఎంపీడీఓ కే.తిరుమల స్వామిని వివరణ కోరగా.... మండల పరిధిలోని గొట్లపల్లి గ్రామపంచాయతీలో మ్యారేజ్ సర్టిఫికెట్, బర్త్ సర్టిఫికెట్లకు సంబంధించిన అంశంపై పూర్తిస్థాయిలో లోతుగా విచారణ చేపడతామని తెలిపారు. ధ్రువపత్రాల జారీలో ఏమైనా అవకతవకలు జరిగినట్లు తేలితే సంబంధిత వారికి నోటీసులు జారీ చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# డిప్యూటీ ఎమ్మార్వో కార్తీక్‌ను సన్మానించిన బండమేది వెంకటేష్

**శంకర్ పల్లి సెప్టెంబర్ 15(ప్రజాక్షేత్రం):**

శంకర్‌పల్లి మండల డిప్యూటీ ఎమ్మార్వోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కార్తీక్ను బీసీ సంక్షేమ సంఘం చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షులు బండమీది వెంకటేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బండమీది వెంకటేష్ డిప్యూటీ ఎమ్మార్వో కార్తీక్‌కు భగవద్గీతను అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. నూతన బాధ్యతల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ, పారదర్శకంగా సేవలందించాలని ఆకాంక్షించారు. శంకర్‌పల్లి మండలంలో రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండటం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. డిప్యూటీ ఎమ్మార్వో కార్తీక్ మాట్లాడుతూ తనపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

- **నాలుగు మండలాల్లో బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు.**
- **పార్టీ బలోపేతంపై ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి దిశానిర్దేశం.**

**షాబాద్, సెప్టెంబర్ 15(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు కేఎస్ రత్నం ఆధ్వర్యంలో నాలుగు మండలాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీలు నిర్వహించారు. వివిధ గ్రామాల బీజేపీ అధ్యక్షులు, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ విమోచన దినోత్సవం ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. షాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో బీజేపీ నాయకులు పార్టీ జెండాలతో ముందుకు సాగుతూ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ చారిత్రక పోరాటాలు, విమోచన దినోత్సవ ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు.

**చరిత్రను భావితరాలకు తెలియజేయాలి**

ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతం అనేక చారిత్రక పోరాటాల ఫలితంగా స్వేచ్ఛను సాధించిందన్నారు. నాటి పోరాటాల చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, నాటి పోరాటాల చరిత్రను ప్రజలకు తెలియజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల్లో చారిత్రక అవగాహన పెంపొందించడంతో పాటు దేశభక్తి, జాతీయ భావాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విమోచన దినోత్సవ కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లి ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

**పార్టీ బలోపేతానికి కృషి చేయాలి**

ప్రతి గ్రామంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. గ్రామ అధ్యక్షులు, బీజేవైఎం నాయకులు యువతను పెద్ద సంఖ్యలో పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రజల నుంచి బీజేపీకి సానుకూల స్పందన వస్తోందని, రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'హర్ ఘర్ తిరంగా' వంటి దేశభక్తి కార్యక్రమాల స్ఫూర్తితో జాతీయ భావాలను ప్రజల్లో మరింతగా పెంపొందించేందుకు కృషి చేయాలని నాయకులు సూచించారు. షాబాద్ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మద్దూరి మానయ్య, బీజేవైఎం నాయకులు కూతురు మహేందర్, కాల్వ రవీందర్‌రెడ్డి, కిరణ్, రాము, లింగాల మహేందర్, మన్మర్రి సర్పంచ్ లాలాపేట బందయ్య, క్యామ నారాయణ, కార్యదర్శి హరీష్, బర్క శ్రీశైలంతో పాటు మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జై భీమ్ కాలనీల్లో ఘనంగా గణనాథునికి రెండో రోజు పూజలు

- **కుటుంబ సమేతంగా పాల్గొన్న లింగాల బాలకృష్ణ–భార్గవి దంపతులు**

**షాబాద్, సెప్టెంబర్ 15(ప్రజాక్షేత్రం)**

షాబాద్ మండల కేంద్రంలోని జై భీమ్ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథునికి రెండో రోజు పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. గణనాథుని విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, వేద మంత్రోచ్ఛారణల మధ్య పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాల బాలకృష్ణ, భార్గవి దంపతులు కుటుంబ సమేతంగా గణనాథుని పూజలో పాల్గొన్నారు. గణపతి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గణనాథుని కృపతో కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని వారు ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా జై భీమ్ కాలనీలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. చిన్నారులు, మహిళలు, యువత ఉత్సాహంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొంటుండటంతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గణనాథుని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు.

ప్రతి రోజు గణనాథునికి పూజలు, హారతులు నిర్వహిస్తూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులందరూ గణనాథుని ఆశీస్సులు పొందాలని, వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా, ఆనందోత్సాహాల మధ్య కొనసాగాలని వారు కోరుకున్నారు.



# ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా కలిసిన మల్కాపూర్ నాయకులు

- **సర్పంచ్ పండరి, ఉపసర్పంచ్ జగదీష్ గౌడ్ కలిసి మైనారిటీ సోదరుల భేటీ.**

**తాండూరు సెప్టెంబర్, 15(ప్రజాక్షేత్రం):**

తాండూర్ మండలం మల్కాపూర్ గ్రామ సర్పంచ్ ఎస్. పండరి, ఉపసర్పంచ్ జగదీష్ గౌడ్‌తో పాటు గ్రామ మైనారిటీ సోదరులు మంగళవారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యలు తదితర అంశాలపై ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సదర్ సాబ్ పి. మౌలానా, అమీర్ పటేల్, జి. మైనొద్దిన్, రషీద్ భాయ్, గౌస్ పటేల్, బషీర్ భాయ్, తాజుద్దీన్, సెర్ఫొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# అనారోగ్యంతో కాంగ్రెస్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే జిఎంఆర్

- **అనారోగ్యంతో కాంగ్రెస్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే జిఎంఆర్**

**భూత్పూర్ సెప్టెంబర్ 15(ప్రజాక్షేత్రం):**

దేవరకద్ర నియోజకవర్గం భూత్పూర్ మున్సిపాలిటీ 4వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు వట్టెం మహేందర్ ఇటీవల అనారోగ్య కారణాలతో సర్జరీ చేయించుకున్న విషయం తెలుసుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆయనను పరామర్శించారు. మహేందర్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే జిఎంఆర్ ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సర్జరీ అనంతరం ఆరోగ్యం ఎలా ఉందని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని, త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యులు సూచించిన విధంగా విశ్రాంతి తీసుకుంటూ మందులు క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. ఈ సందర్భంగా మహేందర్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జిఎంఆర్ ధైర్యం చెప్పారు. ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని జిఎంఆర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు యువకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# 10వ తరగతి అర్హతతో కేజీబీవీలో ఉద్యోగాలు

- **నైట్ వాచ్ ఉమెన్, సహాయ వంట మనిషి పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం**
- **10వ తరగతి ఉత్తీర్ణులై పెద్దేముల్ మండలానికి చెందిన మహిళలే అర్హులు**
- **మారేపల్లి కేజీబీవీ ఎస్ఓ రాజేశ్వరి**

**పెద్దేముల్,సెప్టెంబర్ 15 (ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల పరిధిలోని మారేపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో నైట్ వాచ్ ఉమెన్, సహాయ వంట మనిషి పోస్టులకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండడంతో పాటు పెద్దేముల్ మండలానికి చెందినవారై ఉండాలని ,మహిళలు మాత్రమే ఈ ఉద్యోగాలకు అర్హులని స్పష్టం చేశారు.అర్హత,ఆసక్తి ఉన్న మహిళలు తమ దరఖాస్తులను గురువారం, శుక్రవారం రోజుల్లో కేజీబీవీ మారేపల్లి పాఠశాలలో సమర్పించాలని సూచించారు.ఉద్యోగ అవకాశం కోసం ఆసక్తి ఉన్న అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ఎస్ఓ రాజేశ్వరి కోరారు.



# 24 గంటల విద్యుత్ ఎక్కడ

**ఆత్మకూరు సెప్టెంబర్ 15(ప్రజాక్షేత్రం):**

రైతాంగంపై దయ చూపండి రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని రైతాంగం కోరుకుంటోంది. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకపోతే మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మరియు రైతుల ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్ ముట్టడి కార్యక్రమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాం ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని నిరంతరంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నాం



రైతన్న తరపున బిఆర్ఎస్ పార్టీ రవికుమార్ యాదవ్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# తిరుమల వైభవం వనపర్తిలో గణపతి సందడి

- **వెంకటేశ్వరాలయంలో కొలువుదీరిన గణనాథుడు**
- **తిరుమల తిరుపతి దేవస్థానాన్ని తలపించేలా భారీ సెట్టింగులు..**
- **భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్న అలంకరణ**

**వనపర్తి,సెప్టెంబర్ 15 (ప్రజాక్షేత్రం):**

వినాయక చవితి ఉత్సవాలతో వనపర్తి పట్టణం భక్తిభావంతో మురిసిపోతోంది. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, ఆలయాలు, కాలనీల్లో కొలువుదీరిన గణనాథుల వద్ద ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.అయితే వనపర్తి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం, పాలిటెక్నిక్ కాలేజ్ ఎదురుగా నెలకొల్పిన మండపం, ఈ ఏడాది ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి . ముఖ్యంగా వెంకటేశ్వర దేవాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానాన్ని తలపించేలా భారీగా రూపొందించిన సెట్టింగులు, విద్యుద్దీపాల అలంకరణల మధ్య గణనాథుడిని కొలువుదీర్చడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

**తిరుమల తరహాలో గణనాథుడి కొలువు**

శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గణపతి స్వామి కోసం ప్రత్యేకంగా రూపొందించిన మండపం చూపరులను కట్టిపడేస్తోంది. తిరుమల శ్రీవారి ఆలయాన్ని తలపించేలా నిర్మించిన నమూనా, దానికి అనుగుణంగా చేసిన అలంకరణలు భక్తులను ఆకర్షిస్తున్నాయి. ఆలయ ప్రాంగణంలో గణనాథుడి ప్రతిష్ఠాపనతో పాటు చుట్టూ ఏర్పాటు చేసిన భారీ సెట్టింగులు ఉత్సవాలకు మరింత శోభను తీసుకొచ్చాయి.

**భక్తులకు కనువిందు**

వినాయక చవితి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు గణనాథుడి దర్శనంతో పాటు ప్రత్యేకంగా రూపొందించిన తిరుమల తరహా సెట్టింగ్ కనువిందు చేస్తోంది. కుటుంబ సమేతంగా ఆలయానికి వస్తున్న భక్తులు గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అనంతరం మండపం వద్ద కొద్దిసేపు ఉండి అలంకరణలను ఆసక్తిగా తిలకిస్తున్నారు.

వెలుగుల్లో మరింత వైభవం

పగటిపూట ఆకట్టుకునేలా కనిపిస్తున్న గణపతి మండపం.. రాత్రివేళ విద్యుద్దీపాల వెలుగుల్లో మరింత వైభవంగా దర్శనమిస్తోంది. రంగురంగుల దీపాలతో చేసిన అలంకరణలు, తిరుమల తరహా ఆలయ నమూనా, గణనాథుడి మండపం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ దృశ్యాలను చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. పలువురు భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఫొటోలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు.

**పట్టణమంతా గణపతి సందడి**

వనపర్తి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు పాలిటెక్నిక్ కళాశాల ఎదుట, కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు,హనుమాన్ టెకిడి, పాత వ్యవసాయ మార్కెట్‌లోని గణపతి దేవాలయం, జంగిడిపురం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి మండపాలు భక్తులను ఆకర్షిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు,భజనలు,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉత్సవాలను ఘనంగా కొనసాగిస్తున్నారు.

**ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ**

వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఇప్పటికే నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణానికి తోడు గణపతి ఉత్సవాలు మరింత శోభను తీసుకొచ్చాయి. ఒకవైపు వెంకటేశ్వరస్వామి దర్శనం.. మరోవైపు తిరుమల శ్రీవారి ఆలయాన్ని తలపించే సెట్టింగ్‌లో కొలువుదీరిన గణనాథుడి దర్శనం భక్తులకు ప్రత్యేక అనుభూతిని కలిగిస్తోంది.

**ప్రత్యేక ఆకర్షణగా భారీ సెట్టింగ్**



వనపర్తి వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాల్లో ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. తిరుమల వైభవాన్ని తలపించేలా రూపొందించిన భారీ సెట్టింగ్ భక్తుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. దీంతో వనపర్తి పట్టణవాసులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు సైతం ఈ గణపతి మండపాన్ని సందర్శించి గణనాథుడిని దర్శించుకుంటున్నారు.

# వినాయక శోభాయాత్రలో డీజేలకు నో ఎంట్రీ

- **డీజే ఆపరేటర్లకు బైండోవర్.. రూ.2 లక్షల పూచీకత్తుతో వ్యక్తిగత బాండ్**
- **నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు**
- **పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్**

**పెద్దేముల్, సెప్టెంబర్ 15(ప్రజాక్షేత్రం):**

వినాయక చవితి పండుగ సందర్భంగా నిర్వహించే వినాయక శోభాయాత్ర, నిమజ్జనం కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పెద్దేముల్ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం మండలంలోని 14 మంది డీజే ఆపరేటర్లను తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశారు. ప్రతి డీజే ఆపరేటర్‌ను రూ.2 లక్షల పూచీకత్తుతో వ్యక్తిగత బాండ్‌పై బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. శోభాయాత్ర సమయంలో నిబంధనలకు విరుద్ధంగా డీజేలను ఏర్పాటు చేసినా, అధిక శబ్దంతో నిర్వహించినా సంబంధిత డీజే యజమానులు, నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ హెచ్చరించారు.వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ముఖ్యంగా వినాయక మండపాల నిర్వాహకులు,డీజే ఆపరేటర్లు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



# మంబాపూర్‌లో ఘనంగా హనుమాన్ పల్లకి సేవ

- **భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమాలు.**
- **అనంతరం అన్నదానం**

**పెద్దేముల్,సెప్టెంబర్ 15 (ప్రజాక్షేత్రం):**



పెద్దేముల్ మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో హనుమాన్ పల్లకి సేవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.శ్రావణమాసం ముగింపు సందర్భంగా మంగళవారం భజన సమాప్తి కార్యక్రమంలో భాగంగా సోమవారం తెల్లవారుజామున భక్తులు ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం హనుమంతుడి పల్లకి సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఈ సందర్భంగా హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ వరప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలని, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. దేవాలయాలు కేవలం పూజా స్థలాలే కాకుండా ప్రశాంతతకు, ఆధ్యాత్మిక చింతనకు, సామాజిక ఐక్యతకు నిలయాలుగా ఉండాలని అన్నారు. భక్తి కార్యక్రమాలు ప్రజల్లో సన్మార్గాన్ని పెంపొందించడంతో పాటు గ్రామంలో సోదరభావం, ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. పల్లకి సేవ అనంతరం భక్తులు, గ్రామస్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో గోపాలకృష్ణ ఆలయ కమిటీ చైర్మన్ ముద్దిని రాములు,డైరెక్టర్లు టి.విజయ్ కుమార్,రాజవర్ధన్ రెడ్డి,తలారి రాములు,భజన మండలి సభ్యులు జి.గోవర్ధన్ రెడ్డి, కోమటి శ్రీనివాస్, జె.నర్సింహులు,సి.నర్సింహులు,మంగలి రాములు,బి.బీమ్లు,చెవుల శ్రీనివాస్,కమ్మరి శ్రీనివాస్,గొబ్బూరు మల్లప్ప,సంగెం వెంకటయ్య, సంగెం శ్రీనివాస్,సంగెం చంద్రప్ప,లాలప్ప, గొబ్బురు గోపాల్,యాలాటి రాములు, హకీంపేట దస్తప్ప,సంగెం చంద్రప్ప,కమ్మరి రాములు,ఆలయ కమిటీ డైరెక్టర్ సాయిని నారాయణ రెడ్డి,గ్రామస్తులు హర్షవర్ధన్ రెడ్డి ,అనిల్ కుమార్,కమ్మరి సిద్ధప్ప,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానం

- **ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**శంషాబాద్ సెప్టెంబర్15(ప్రజాక్షేత్రం):**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శంషాబాద్ మండల పరిధిలో విద్యార్థుల అభివృద్ధికి విశేష సేవలందించిన గురువులకు "ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు 2026"ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.స్థానిక ఎంపీడీవో కార్యాలయ మీటింగ్ హాల్ లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ విచ్చేశారు.మండల విద్యాధికారి, మండల వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలో విద్యారంగంలో అత్యుత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని,వారి సేవలు వెలకట్టలేనివని అన్నారు.అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు,ప్రజాప్రతినిధులు,ఉపాధ్యాయులు పెద్ద




# కోటగిరిలో లయన్స్ క్లబ్ 320డి ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే

**బాన్సువాడ సెప్టెంబర్ 15(ప్రజాక్షేత్రం):**


నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజక వర్గం కోటగిరి మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డిస్ట్రిక్ట్ 320డి ఆధ్వర్యంలో మంగళవారం ఇంజనీరింగ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ కోటగిరి మీటింగ్ ఆల్ నందు భారత రత్న మోక్షగుండ విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కోటగిరి మండల పరిధిలోని పలు విభాగాలలో ఇంజనీరింగ్ సేవలు అందిస్తున్న ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ధనరాజ్, పీఆర్ ఏఈ నవదీష్ గౌడ్, ఇరిగేషన్ ఏఈ రవి కుమార్, విద్యుత్ ఏఈ బుజ్జిబాబు, అసిస్టెంట్ ఏఈ సిహెచ్.సుమిద, ఇంజనీర్లకు క్లబ్ ప్రతినిధులు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఇంజనీరింగ్ డే సందర్భంగా మా సేవలను గుర్తించి సన్మానించి లయన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డిస్ట్రిక్ట్ 320డి ప్రతినిధులకు సన్మాన గ్రహీతలు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు, సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ గ్రామాలభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. విశ్వేశ్వరయ్య ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోఎంపీడీవో విష్ణు,లైన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డిస్ట్రిక్ట్ 320డీ ప్రధాన కార్యద ర్శి పత్తి లక్ష్మణ్, ప్రతినిధులు జి.హనుమంత్ రావు, పి.అశ్విని, పి.నిశాంత్, పి.అనిల్, కే.సిద్దు, డి.ఉదయ భాస్కర్, బీ.శ్యామ్, హౌగిరావ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.




# ఖరీదైన బంగారు వినాయకుడు

- **కిలో బంగారు ఆభరణాలు తో గణనాథుడు ప్రతిష్ట**

**నంద్యాల,సెప్టెంబర్ 15 (ప్రజాక్షేత్రం ):**



కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలో ప్రత్యేకంగా ఆకర్షణీయంగా కనువిందు చేసే విధంగా గణపతి విగ్రహాలను ఏర్పాటు చేశారు. సోమవారం ఎమ్మిగనూరు పట్టణంలో కోర్టు రోడ్డు శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో ఖరీదైన కిలో బంగారు ఆభరణాలు తో పాటు మరో కొన్ని ఇత్తడి నాణెములు తో బంగారు వినాయకుడు ను ప్రతిష్ఠించారు. దీని విలువ కోటి రూపాయల వరకు ఉంటుంది. 20 మంది వినాయక మండలి సభ్యులు 3 రోజులు పాటు భద్రత గా ఉంటారు.పోలీసులు బందోబస్తు మధ్య పూజలు జరుగుతాయి. ప్రత్యేకమైన గోల్డ్గణ నాథుడు ను ప్రజలు దర్శించుకున్నారు. అలాగే కొండవీటి ప్రాంతంలో తెలుగు రాముడు ఆధ్వర్యంలో సముద్రపు గవ్వలు తో మత్స్య వతార వినాయకుడు కు ఎర్పాటు చేశారు.శిల్పా ఎస్టేట్ కాలని లో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. సోమప్ప నగర్ లో గురిగింజ లతో ప్రత్యక వినాయకుడు ను ప్రతిష్ఠించారు.తేరు బజారు,శివ సర్కిల్,లక్ష్మిపేట,గాంధీనగర్, హెచ్బిఎస్ కాలని,మునేప్ప నగర్,యన్టిఆర్ కాలని,వీవర్స్ కాలని,ఎస్ ఎం టి కాలని,వెంకటాపురం, మిలిటరీ కాలని, యల్లమ్మ బీడు,వ్యవసాయ మార్కెట్ కమిటీ, తో పట్టణం లో అన్ని వార్డుల్లో వినాయకుడు విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తి శ్రద్ధలు తో పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

# విఘ్నేశ్వరుడి పూజలో శివసేన రెడ్డి

- **స్వగృహంలో సతీసమేతంగా ప్రత్యేక పూజలు.**
- **ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు.**

**వనపర్తి,సెప్టెంబర్ 15 (ప్రజాక్షేత్రం):**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వనపర్తి డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి తన స్వగృహంలో సతీసమేతంగా గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజించారు. కుటుంబసభ్యులతో కలిసి విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి,స్వామివారి ఆశీస్సులు పొందారు. వినాయక చవితి సందర్భంగా శివసేన రెడ్డి నివాసంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రథమ పూజితుడైన గణపతికి పూజా కార్యక్రమాలు నిర్వహించి, రాష్ట్ర, జిల్లా ప్రజలందరి శ్రేయస్సును ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో ఎదురయ్యే విఘ్నాలు తొలగి, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆనందం, సౌభాగ్యం వెల్లివిరియాలని ప్రార్థించారు.



ఈ సందర్భంగా శివసేన రెడ్డి రాష్ట్ర, జిల్లా ప్రజలకు హృదయపూర్వక వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలంతా భక్తిశ్రద్ధలతో వినాయక చవితిని జరుపుకోవాలని కోరారు.

# ఉద్యమకారుల చరిత్రను భావితరాలకు అందించాలి

- **సంగీశెట్టి క్రిస్టఫర్ టి ఎమ్ యు ఎస్ రాష్ట్ర అధ్యక్షులు**

**వలిగొండ,సెప్టెంబర్ 15 (ప్రజాక్షేత్రం**

స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన పోరాట యోధుల చరిత్రను భావితరాలకు అందించాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు.మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ తెలంగాణ రాష్ట్రం కోసం జైలునిర్బంధాలు టియర్ గ్యాస్ బాష్ప వాయువు పోలీసులు లాటి దెబ్బలు రబ్బర్ బుల్లెట్ కు ఎదురోడి పోరాడిన పోరాటాల యోధుల చరిత్రను భావితరాలకు అందించడం మన ముందున్న కర్తవ్యం అని క్రిస్టఫర్ డిమాండ్ చేశారు.సమైక్య పాలకులు ఎన్ని నిర్బంధాలు పెట్టిన సంవత్సరాల కొద్ది పీడీ యాక్ట్ లు పెట్టిన లెక్క



చేయని త్యాగదనుల చరిత్రను భావితరాలకు అందించి చరిత్రను లిఖించబడేలా ఉండాలని ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.ఒకవైపు భార్యా పిల్లలు మరోవైపు జైలు నిర్బంధాలు కాళ్లు చేతులు విరిగిన లాటిలు విరిగిన రాష్ట్రం కోసం అలుపెరుగని పోరాటం చేసిన పోరాట యోధుల త్యాగాలు వృధా కానివ్వవద్దని క్రిష్టఫర్ డిమాండ్ చేశారు.

# వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చేతుల మీదుగా ప్రకృతి వ్యవసాయ కిట్లు అందజేత

**షాబాద్ సెప్టెంబర్ 15(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్ర సెక్రటేరియట్ లో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకంలో ఎంపిక చేసిన షాబాద్ మండల ఐదుగురు రైతులకు గౌరవ వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చేతుల మీదుగా ప్రకృతి వ్యవసాయ కిట్లు రైతులకు అందజేయడం జరిగినది. కేంద్ర ప్రభుత్వ నేషనల్ మిషన్ ఫర్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్.యం.ఎన్. ఫ్) కార్యక్రమంలో భాగంగా మంగళవారం షాబాద్ రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా "సహజ వ్యవసాయంపై అవగాహన-దిశానిర్దేశ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ పద్ధతులు, భూసార పరిరక్షణ మరియు సహజ వనరుల వినియోగంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చేవెళ్ల డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సురేష్ బాబు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం ద్వారా రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని క్రమంగా తగ్గించి, స్థానికంగా లభించే సహజ వనరులను వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు పంటల సాగు వ్యయాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులు



ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ప్రాధాన్యత, ప్రయోజనాలు మరియు అమలు విధానాలపై పూర్తి అవగాహన పెంచుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా మండల వ్యవసాయ అధికారి దండెం. విజయచంద్ర మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన ముడి పదార్థాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఘనజీవామృతం, జీవామృతం వంటి సహజ ఇన్‌పుట్‌ల తయారీ మరియు వినియోగంపై రైతులకు అవగాహన కల్పించి, అవసరమైన మేరకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శివ తేజ, క్రిషిసఖీలు జి. మాధవి, మమత, అంతారం గ్రామ రైతులు కుర్వ మల్లయ్య, బి యాదయ్య, పెంటమ్మ, జి మాధవి, జె మల్లయ్య, జి శ్రీశైలం, నర్సింహులు, తదితర రైతులు పాల్గొన్నారు.

# పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి.

- **సామాజికవేత్త కందకంట్ల సిద్దు రెడ్డి.**

**శంషాబాద్ సెప్టెంబర్15(ప్రజాక్షేత్రం):**

శంషాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాలను సామాజిక సేవకుడు, ప్రముఖ వ్యాపారవేత్త కందకట్ల సిద్దురెడ్డి సోమవారం సందర్శించారు. పాఠశాలకు విచ్చేసిన ఆయనకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ఘన స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల భవనం, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి ,వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా సిద్దురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. పాఠశాలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను త్వరలోనే తన సొంత ఖర్చులతో కల్పిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సిద్దిరెడ్డి ఇచ్చిన హామీ పట్ల విద్యార్థులు,ఉపాధ్యాయులు, హర్షం వ్యక్తం చేశారు. గతంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన సిద్దిరెడ్డి సేవలను పలువురు కొనియాడారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.





## తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే.

- **రేపు ప్రతి గిరిజన గ్రామంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం.**
- **యాలాల మండల బీఆర్ఎస్ అధ్యక్షులు సి.రవీందర్ రెడ్డి.**

**యాలాల,సెప్టెంబర్ 15(ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్ది,గిరిజనులకు ప్రత్యేక గుర్తింపు కల్పించిన ఘనత మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కేసీఆర్కే దక్కుతుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్రెస్ మీట్ ఏర్పాటుచేసి తెలిపారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ గురువారం (17న) గిరిజన తండాలలో మాజీ సిఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు.

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గిరిజన తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేశారని తెలిపారు. దీంతో ఎన్నో ఏళ్లుగా ప్రత్యేక గ్రామపంచాయతీ కోసం ఎదురుచూస్తున్న గిరిజన తండాల ప్రజల ఆకాంక్ష నెరవేరిందన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిందని పేర్కొన్నారు. గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ రేపు గురువారం ప్రతి గిరిజన గ్రామంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి గిరిజన గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ శ్రేణులు, గిరిజన ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే. గిరిజనులకు ప్రత్యేక గ్రామపంచాయతీలతో స్వయం పాలనకు అవకాశం. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం ప్రాధాన్యత. సెప్టెంబర్ 17న ప్రతి గిరిజన గ్రామంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో సుక్య నాయక్,దక్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే.

## వర్షంలోనూ విధులే భక్తితో అన్నదానమే

- **పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం.**
- **రెయిన్‌కోట్ల పంపిణీ.**
- **వినాయక ఉత్సవాల్లో పోలీసుల ఆధ్వర్యంలో అన్నదానం.**
- **ఐకమత్యం,సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి.**
- **ఎస్పీ సునితారెడ్డి.**

**వనపర్తి,సెప్టెంబరు 15(ప్రజాక్షేత్రం):**

ప్రజల భద్రత కోసం ఎండ, వానలను లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని జిల్లా ఎస్పీ సునితారెడ్డి అన్నారు.

వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఒకవైపు వర్షాకాలంలో విధులు నిర్వహించే పోలీసులకు రెయిన్‌కోట్లను అందజేయగా మరోవైపు పోలీసు కార్యాలయ ప్రాంగణంలోని మట్టి గణనాథుడి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రెయిన్‌కోట్ల పంపిణీ

వర్షాకాలంలో విధి నిర్వహణలో పోలీసు సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సునితారెడ్డి పోలీసు అధికారులు, సిబ్బందికి రెయిన్‌కోట్లను అందజేశారు. ప్రజల రక్షణ కోసం ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఆరోగ్యం, భద్రతకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం పోలీసుశాఖ బాధ్యతగా భావిస్తోందన్నారు. పోలీసులు ఆరోగ్యంగా, సురక్షితంగా ఉంటేనే ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించగలరని పేర్కొన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంక్షేమానికి సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి నేరుగా తీసుకురావచ్చని సిబ్బందికి భరోసా ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో అన్నదానం

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలోని సాయుధ దళ పోలీసు కార్యాలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన మట్టి గణనాథుడి వద్ద రెండో రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఎస్పీ సునితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. అనంతరం పోలీసు సిబ్బందితో కలిసి భక్తులకు,సిబ్బందికి అన్నప్రసాదాన్ని వడ్డించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె భోజనం చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో,ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఉత్సవాల నిర్వహణలో పోలీసు సిబ్బంది ఐకమత్యం, సమన్వయం, అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

శాంతిభద్రతలే లక్ష్యం

విధి నిర్వహణలో క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేయాలని ఎస్పీ సూచించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలిగి వారి సమస్యలను సానుభూతితో విని, తక్షణమే స్పందించేలా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది పనిచేయాలని అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు పోలీసుశాఖ సూచనలు, నిబంధనలు పాటిస్తూ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే పండుగలను ప్రశాంతంగా, ఆనందోత్సాహాలతో నిర్వహించుకోగలమన్నారు.

భక్తి, భద్రత,బాధ్యతతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

కార్యక్రమాల్లో వనపర్తి డీఎస్పీ గిరిబాబు, సీఐ సుగంధరత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు,శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ హరిప్రసాద్, ప్రత్యేక విభాగం ఎస్ఐలు మంజునాథ్‌రెడ్డి,పర్వతాలు, సీసీఎస్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ ఎస్ఐ తిరుపతిరెడ్డి, రిజర్వ్ ఎస్ఐలు వినోద్, మగ్దూంబారీ,ట్రాఫిక్ ఎస్ఐ సురేందర్,పోలీసు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోవింద్,పోలీసు అధికారులు, సిబ్బంది,పోలీసు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




## వినాయక నిమజ్జన ఘాట్‌లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

- **అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట ఏర్పాట్లు**

**నంద్యాల,సెప్టెంబర్15 (ప్రజాక్షేత్రం ):**

వినాయక నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ముందస్తు చర్యలు చేపడుతోందనీ నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ అన్నారు.

ఈ నేపథ్యంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ నేడు ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోని,వెలుగోడు, ఆత్మకూరు,పాములపాడు, జూపాడుబంగ్లా మొదలగు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న వినాయక నిమజ్జన ఘాట్‌లను, మరియు ఊరేగింపు జరిగే ప్రధాన ప్రాంతాలను స్వయంగా ఎస్పీ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎస్పీ సునీల్ షోరాన్ నిమజ్జన ఘాట్‌ల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, ప్రజల రాకపోకలు,వాహనాల నియంత్రణ,పోలీస్ బందోబస్తు తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని,ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమాలు సజావుగా జరిగేలా ఘాట్‌ల వద్ద నిరంతరం పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉండాలని, రద్దీని క్రమబద్ధీకరించడంతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

అలాగే నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొనే ప్రజలు,పోలీసులకు సహకరించి, పోలీస్ శాఖ సూచించిన భద్రతా నిబంధనలను పాటించాలని జిల్లా ఎస్పీ కోరారు.



ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ అశోక్,ఆత్మకూరు అర్బన్ సీఐ మహేశ్వర్ రెడ్డి, రూలర్ సీఐ ఎం.సురేష్ కుమార్ రెడ్డి, పాములపాడు ఎస్ఐ పి.తిరుపాలు,సంబంధిత పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## భూములపై పోరు.. మాటలపై మంట!

- **ఫిబ్రవరి నోటిఫికేషన్ నుంచి సెప్టెంబర్ 12 రైతుల ధర్నా వరకు..**
- **ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి వర్షన్ ఒకవైపు.. "మేం భూములు ఇవ్వలేదు" అంటున్న రైతులు మరోవైపు!**

వికారాబాద్ జిల్లా పరిగి మండలంలోని కాళ్లాపూర్, రాపోల్ గ్రామాల పరిధిలో ప్రతిపాదించిన ఇండస్ట్రియల్ పార్కు భూసేకరణ వ్యవహారం ఇప్పుడు పెద్ద వివాదంగా మారింది. సుమారు 1,197 ఎకరాల భూమి పారిశ్రామిక అవసరాల కోసం సేకరించేందుకు చేపట్టిన ప్రక్రియపై రైతులు మొదటి నుంచీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరిలో నోటిఫికేషన్లు వెలువడినప్పటి నుంచి రిలే దీక్షలు, ధర్నాలు, గ్రామసభల వివాదం, పోలీసుల జోక్యం, రాజకీయ నాయకుల అదుపులోకి తీసుకోవడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. తాజాగా సెప్టెంబర్ 11న అసెంబ్లీలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు.. సెప్టెంబర్ 12న కాళ్లాపూర్ రైతులు పరిగిలో చేపట్టిన ఆందోళనతో వివాదం మళ్లీ భగ్గుమంది. ఫిబ్రవరిలోనే మొదలైన భూసేకరణ ప్రక్రియ

కాళ్లాపూర్ పరిధిలో 428.05 ఎకరాల అసైన్డ్ భూములు, 159.25 ఎకరాల పట్టా భూములు, రాపోల్ పరిధిలో 509 ఎకరాల అసైన్డ్ భూములు, 101.08 ఎకరాల పట్టా భూములు కలిపి సుమారు 1,197 ఎకరాల మేర ఇండస్ట్రియల్ పార్కు కోసం భూసేకరణ ప్రతిపాదన ఉందని వార్తా నివేదికలు పేర్కొన్నాయి. 2026 ఫిబ్రవరిలో నోటిఫికేషన్ రావడంతోనే కాళ్లాపూర్ రైతుల్లో ఆందోళన మొదలైంది. తమ వ్యవసాయ భూములు పరిశ్రమల కోసం తీసుకోవద్దని వారు అధికారులను ఆశ్రయించారు. రైతుల వాదన ప్రకారం ఈ భూములపై వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. భూములు కోల్పోతే పరిహారం వచ్చినా తమ కుటుంబాల భవిష్యత్ ఏమవుతుందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వందలాది కుటుంబాలు ఈ భూములపై ఆధారపడి ఉన్నాయని రైతు వర్గాలు చెబుతున్నాయి. అయితే ప్రభావిత కుటుంబాల తుది అధికారిక సంఖ్యను ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాల్సి ఉంది.

**మార్చి 26.. పరిగిలో రోడ్డెక్కిన రైతులు**

భూసేకరణకు వ్యతిరేకంగా మార్చి 26న కాళ్లాపూర్ రైతులు పరిగిలో ర్యాలీ నిర్వహించి జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. ఆందోళనతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా పోలీసులు రంగంలోకి వచ్చారు. రైతులను అదుపులోకి తీసుకునే ప్రయత్నంతో ఉద్రిక్తత నెలకొన్నట్లు వార్తలు వచ్చాయి.

**ఏప్రిల్ 7.. పరిగి పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత**

కాళ్లాపూర్, రాపోల్ రైతులు రిలే దీక్షలకు అనుమతి కోరుతూ పరిగి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. అనుమతి నిరాకరించడంతో పోలీస్‌స్టేషన్ ఎదుటే రైతులు ఆందోళనకు దిగారు. మహిళా రైతులు కూడా నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి.

**జూన్ 11.. ఆమరణ నిరాహారదీక్ష**

జూన్ 11న కాళ్లాపూర్ రైతులు ఆమరణ నిరాహారదీక్షకు దిగారు. భూసేకరణను నిలిపివేయాలని, గ్రామసభ నిర్వహించవద్దని డిమాండ్ చేశారు. తమతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చర్చించి కొన్ని హామీలు ఇచ్చారని, ముఖ్యంగా పట్టా భూముల విషయంలో భరోసా కల్పించారని రైతులు చెబుతున్నారు. ఆ హామీ నేపథ్యంలో దీక్ష విరమించినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈ హామీకి సంబంధించిన పూర్తి లిఖితపూర్వక అధికారిక పత్రం అందుబాటులో లేకపోవడంతో దీనిని రైతుల వాదనగానే పరిగణించాలి. రాపోల్‌లోనూ భూసేకరణకు సంబంధించిన గ్రామసభ నిర్వహించారు. రైతులు తమ భూములు ఇవ్వబోమని స్పష్టం చేసినట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయి. రైతుల అభ్యంతరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని అధికారులు తెలిపారు.

**పోలీసుల జోక్యం.. రాజకీయ వేడి**

రైతుల ఉద్యమానికి మద్దతు తెలిపేందుకు వచ్చిన రాజకీయ నాయకులను కూడా పోలీసులు అడ్డుకున్న ఘటనలు చోటుచేసుకున్నాయి. మాజీ మంత్రి హరీశ్‌రావు పరిగి పర్యటనకు ముందుగా పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిని కూడా రైతుల ఆందోళన నేపథ్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే రాజకీయ పార్టీల ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా కాకుండా ఆయా పార్టీల వాదనలుగా చూడాలి. పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే చర్యలు తీసుకున్నామని చెబుతున్నారు.

**సెప్టెంబర్ 11.. అసెంబ్లీ ప్రకటనతో మళ్లీ రగడ**

సెప్టెంబర్ 11న అసెంబ్లీలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కాళ్లాపూర్, రాపోల్‌తో పాటు దోమ మండలంలోని కొన్ని గ్రామాల రైతులు ఇండస్ట్రియల్ పార్కు కోసం భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చారని, అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారని చెప్పినట్లు వార్తా నివేదిక పేర్కొంది. ఈ ప్రకటనపై కాళ్లాపూర్ రైతులు తీవ్రంగా స్పందించారు. "మేము భూములు ఇవ్వలేదు.. మరి మేం భూములు ఇచ్చామని ఎలా చెబుతారు?" అంటూ ప్రశ్నించారు.

**సెప్టెంబర్ 12.. ఎమ్మెల్యే నివాసం వద్ద రైతుల ఆందోళన**

ఎమ్మెల్యే ప్రకటనకు నిరసనగా సెప్టెంబర్ 12న కాళ్లాపూర్ రైతులు పరిగిలో ఎమ్మెల్యే నివాసం వద్దకు వెళ్లారు. ఎమ్మెల్యే అక్కడ లేకపోవడంతో బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. ఆందోళన సాయంత్రం వరకు కొనసాగినట్లు తాజా నివేదిక తెలిపింది. ఎమ్మెల్యే చెప్పింది.. రైతులు చెబుతున్నది

మ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి వర్షన్ ప్రకారం కాళ్లాపూర్, రాపోల్ తదితర ప్రాంతాల రైతులు ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. పరిశ్రమలు రావాలని కోరుతున్నారు. మరోవైపు రైతులు మాత్రం తాము భూములు ఇవ్వలేదని, మొదటి నుంచీ భూసేకరణను వ్యతిరేకిస్తున్నామని చెబుతున్నారు. ఇక్కడ ఎవరు నిజం? ఎవరు తప్పు? అనే తీర్పును మీడియా ఇవ్వాల్సిన అవసరం లేదు. రికార్డులు బయటకు వస్తేనే అసలు వాస్తవం తేలుతుంది. ఎమ్మెల్యే చెప్పిన "రైతులు భూములు ఇచ్చారు" అన్న మాటకు ఆధారం ఏమిటి? ఏ సర్వే నంబర్లు? ఎంత భూమి? ఎవరెవరు అంగీకరించారు? ఎప్పుడు అంగీకరించారు? ఏ పత్రాలపై సంతకాలు చేశారు? పరిహారం చెల్లించారా? భూమి ప్రభుత్వం స్వాధీనం చేసుకుందా? అనే వివరాలు బహిరంగం కావాలి.



**1197 ఎకరాలు ఇప్పటికే పోయాయా?**

ఇది ఈ వివాదంలో అత్యంత కీలకమైన ప్రశ్న. అందుబాటులో ఉన్న నమ్మదగిన ఆధారాల ప్రకారం 1,197 ఎకరాల మొత్తం భూమిని ప్రభుత్వం ఇప్పటికే స్వాధీనం చేసుకున్నట్లు నిర్ధారణ లేదు. 1,197 ఎకరాలు ప్రధానంగా ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్కు భూసేకరణ విస్తీర్ణంగా వార్తల్లో నమోదైంది. అందువల్ల "1,197 ఎకరాలు ఇప్పటికే రైతుల నుంచి తీసుకున్నారు" అని చెప్పడం కంటే "సుమారు 1,197 ఎకరాల భూసేకరణ ప్రతిపాదనపై వివాదం కొనసాగుతోంది" అని చెప్పడం వాస్తవానికి దగ్గరగా ఉంటుంది. ఇప్పటివరకు ఎంత భూమికి తుది అవార్డు ఇచ్చారు? ఎంత భూమికి పరిహారం చెల్లించారు? ఎంత భూమి టిజిఐఐసి పేరున బదిలీ అయింది? ఎంత భూమిని ప్రభుత్వం వాస్తవంగా స్వాధీనం చేసుకుంది? అనే పూర్తి లెక్కలను సంబంధిత రెవెన్యూ అధికారులు బహిరంగంగా ప్రకటించాల్సి ఉంది.

**ఎంతమంది రైతులు?**

ప్రభావిత కుటుంబాల సంఖ్యపై రైతు వర్గాల నుంచి వేర్వేరు సంఖ్యలు వినిపిస్తున్నప్పటికీ, అధికారికంగా ధృవీకరించిన తుది రైతులు/కుటుంబాల సంఖ్య ప్రస్తుతం అందుబాటులో ఉన్న వార్తా ఆధారాల్లో లేదు. కాబట్టి ఒక సంఖ్యను ఖరారు చేసి ప్రచురించడం సరికాదు. ప్రభుత్వం సర్వే నంబర్ వారీగా భూహక్కుదారుల జాబితా, విస్తీర్ణం, పరిహారం వివరాలు విడుదల చేస్తే ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లభిస్తుంది.

రైతుల నిరసనల సందర్భంగా పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తతలు, అదుపులోకి తీసుకున్న ఘటనలు వార్తల్లో నమోదయ్యాయి. అయితే సెప్టెంబర్ 12న కాళ్లాపూర్ రైతులు ధర్నా చెమట పోలీసు సభ్యులకు తీసుకొని పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లారు.

**భూముల లెక్కను ప్రభుత్వం బయటపెట్టాలి**

ఇప్పుడు అసలు అవసరం రాజకీయ ఆరోపణలు కాదు.. పూర్తి భూసేకరణ లెక్క. మొత్తం ప్రతిపాదిత భూమి ఎంత? నోటిఫికేషన్ ఎంత? పట్టా భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? అవార్డు ఎంత? పరిహారం పొందిన రైతులు ఎంతమంది? చెల్లించిన మొత్తం ఎంత? ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమి ఎంత? ఇంకా పెండింగ్‌లో ఉన్న భూమి ఎంత? అనే వివరాలను ప్రభుత్వం ఒకే పత్రంలో ప్రజల ముందుంచాలి. అలాగే ఎమ్మెల్యే చెప్పిన "రైతులు భూములు ఇచ్చారు" అన్న ప్రకటనకు ఆధారమైన సర్వే నంబర్లు, రైతుల జాబితా, అంగీకార పత్రాలు ఉంటే వాటిని కూడా బహిరంగపరచాలి.

**సంపాదకీయ వ్యాఖ్య**

పరిశ్రమలు రావాలి. ఉద్యోగాలు రావాలి. పెట్టుబడులు రావాలి. పరిగి అభివృద్ధి చెందాలి. కానీ అభివృద్ధి కోసం భూమి కోల్పోయే రైతు భవిష్యత్తు కూడా అంతే ముఖ్యం. రైతు భూమి తీసుకోవాల్సి వస్తే చట్టబద్ధమైన ప్రక్రియ ఉండాలి. న్యాయమైన పరిహారం ఉండాలి. పునరావాసం ఉండాలి. ప్రత్యామ్నాయ జీవనాధారం ఉండాలి. అన్నింటికంటే ముందుగా రైతుతో చర్చ ఉండాలి. అదే సమయంలో రైతుల ఆందోళన కూడా శాంతియుతంగా, చట్టబద్ధంగా సాగాలి. రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా రైతుల వాస్తవ సమస్య పరిష్కారం కోసం ముందుకు తీసుకెళ్లాలి.

భూములు ఎవరు ఇచ్చారు?

ఎంత భూమి ఇచ్చారు?

ఎంత భూమి నోటిఫికేషన్‌లో ఉంది?

ఎంత భూమి ఇప్పటికే స్వాధీనం అయింది?

ఎంతమందికి పరిహారం ఇచ్చారు?

ఎమ్మెల్యే ప్రకటనకు ఆధారం ఏమిటి?


రైతులు చెబుతున్న అభ్యంతరాలపై ప్రభుత్వం ఏం చెబుతోంది?

సెప్టెంబర్ 12న నిరసనపై ఎఫ్ఐఆర్ ఉందా? ఉంటే నంబర్ ఏమిటి?

కేసు కోర్టుకు వెళ్లిందా? కేసు నంబర్ ఏమిటి?

ఈ ప్రశ్నలకు అధికారిక రికార్డులతో సమాధానాలు బయటకు వస్తేనే కాళ్లాపూర్-రాపోల్ భూసేకరణ వ్యవహారంలో పూర్తి నిజం ప్రజలకు తెలుస్తుంది.

అభివృద్ధి కావాలి.. రైతు బతుకూ కాపాడాలి! మాటలతో కాదు.. భూముల పూర్తి లెక్కలతో నిజం తేలాలి!



**ఎం రవీందర్**
**సీనియర్ జర్నలిస్టు**
**7901503777**

## బిక్షగాడిగా మారిన మహా ఎమ్మెల్యే!



రూ. 3,383 కోట్ల ఆస్తులున్న మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే పరాగ్ షా తన ఆధ్యాత్మిక గురువు ఆదేశం మేరకు ముంబై వీధుల్లో ఒక్కరోజు భిక్షగాడిగా మారి నిరాడంబర జీవిత వాస్తవాలను అనుభవించారు. సెక్యూరిటీని, విలాసాలను వదిలి చిరిగిన బట్టలతో ఘాట్‌కోపర్ వీధుల్లో బిక్షాటన చేసిన ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతోంది. 'నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రజల నుంచి లభించే గౌరవ మర్యాదలు వేరు. అదే వ్యక్తుల దగ్గరకు నేను భిక్షగాడిగా వెళ్లినప్పుడు, వారు నాకంటే ఉన్నతమైన వారిగా కనిపిస్తారు. ఏదైనా మనం చూసే చూపులోనే ఉంటుంది. అదే జీవిత సత్యం. అంతేకాకుండా దీని ద్వారా ముంబయి ప్రజలలోని సహాయ గుణాన్ని కూడా నేను తెలుసుకున్నాను'

**-పరాగ్ షా, భాజపా ఎమ్మెల్యే, మహారాష్ట్ర**

## బాలాపూర్ గణేశుడిని దర్శించుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**బాలాపూర్ సెప్టెంబర్ 15(ప్రజాక్షేత్రం):**

వినాయక చవితి నవరాత్రులు సందర్భంగా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డితో కలిసి బాలాపూర్ గణేష్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుడి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ప్రతి కుటుంబంలో ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం వెల్లివిరియాలని స్పీకర్ ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, యువత, భక్తులను అభినందించారు.



# కౌన్సలర్ చౌహాన్ వకీల్ మరియు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో గణనాథుడు ప్రతిష్టాపన

**జహీరాబాద్,సెప్టెంబర్ 15( ప్రజాక్షేత్రం):** వినాయక చవితితో జహీరాబాద్ మండలం లోని హోతీ(కె)వార్డు 7 పండుగ వాతావరణం నెలకొంది.చిన్నారులు,మహిళలు,యువతతో మండపాల వద్ద సందడి నెలకొంది. గణనాథుడి నామస్మరణతో గ్రామం లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. సోమవారం ఉదయం నుంచి భక్తులు మండపాలకు చేరుకుని పూజలు, నైవేద్యాలు సమర్పిస్తున్నారు.

విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు వాడవాడలా కొలువుదీరాడు.వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని హోతీ కె గ్రామం వార్డు 7 గణనాథుడి విగ్రహాలను సోమవారం ఘనంగా ప్రతిష్ఠించారు.భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ గణపయ్యను కొలుస్తున్నారు.దీంతో గ్రామం లోని ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.వినాయక చవితి నేపథ్యంలో కొద్ది రోజులుగా మండపాల ఏర్పాట్లు, అలంకరణలు, విద్యుత్ దీపాల అమరిక తదితర పనులతో సందడిగా కనిపించిన గ్రామం లో .సోమవారం గణనాథుడి ప్రతిష్ఠతో పండుగ కళను సంతరించుకున్నాయి. గ్రామం లో రంగురంగుల విద్యుత్ దీపాలు, పుష్పాలు, ప్రత్యేక అలంకరణలతో ముస్తాబు చేశారు.

**మండపాల్లో ప్రత్యేక ఆకర్షణలు**

హోతీ కె వార్డలోనీ మండపాల వద్ద ఏర్పాటు చేసిన అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.వివిధ రకాల థీమ్‌లతో మండపాలను తీర్చిదిద్దడంతో పాటు గణనాథుడి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు.సాయంత్రం వేళల్లో విద్యుత్ దీపాల వెలుగుల్లో మండపాలు మరింత శోభాయమానంగా కనిపిస్తున్నాయి.భక్తులు కుటుంబ సమేతంగా తరలి వచ్చి గణపయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

**యువతలో ఉత్సాహం.. ఉత్సవాల్లో చురుకైన భాగస్వామ్యం**

వినాయక ఉత్సవాల నిర్వహణలో యువత ప్రధాన భూమిక పోషిస్తోంది. మండపాల ఏర్పాటు నుంచి అలంకరణలు,విద్యుత్ దీపాల అమరిక, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన వరకు యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.తొమ్మిది రోజుల పాటు గణనాథుడికి ప్రత్యేక పూజలు, భజనలు, భక్తి కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి.

**తొమ్మిది రోజులూ భక్తి పారవశ్యమే**

వినాయక చవితి నుంచి నవరాత్రుల వరకు గణనాథుడికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితరాలను నిర్వహించేందుకు బోల్గరి శేఖర్ వార్డు కౌన్సిలర్ చౌహాన్ వకీల్ ఏర్పాట్లు చేస్తున్నారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి.వినాయక చవితి వేడుకలతో హోతీ కె గ్రామం లో భక్తి, ఆధ్యాత్మికత, ఉత్సాహం, ఆనందాల సమ్మేళనంగా మారింది.గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.




# తింసాన్ పల్లిలో గణనాథుని సాక్షిగా అన్నదాన సేవ

- **వినాయకుని సన్నిధిలో భక్తులకు అన్నప్రసాద వితరణ**

**పెద్దేముల్,సెప్టెంబర్ 15 (ప్రజాక్షేత్రం):** పెద్దేముల్ మండల పరిధిలోని తింసాన్‌పల్లి గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి.ఇందులో భాగంగా ప్రముఖ వ్యాపారవేత్త, కోహిర్ క్లే ఇండస్ట్రీస్ అధినేత కోహిర్ రాజు సౌజన్యంతో శ్రీ హనుమాన్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భక్తులు, గ్రామస్తుల కోసం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామంలోని శ్రీ హనుమాన్ దేవాలయ ఆవరణలో ప్రతిష్ఠించిన వినాయకుని సన్నిధిలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా భక్తులు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.వినాయకుని దర్శనం అనంతరం భక్తులకు భోజన వసతి కల్పించడంతో ఉత్సవ ప్రాంగణం సందడిగా మారింది.

ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు పలువురు మాట్లాడుతూ వినాయక ఉత్సవాలలో భాగంగా భక్తులకు, గ్రామస్తులకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందని, గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యత, సేవాభావాన్ని చాటేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అన్నదాన కార్యక్రమానికి సహకారం అందించిన ప్రముఖ వ్యాపారవేత్త, కోహిర్ క్లే ఇండస్ట్రీస్ అధినేత కోహిర్ రాజుకు శ్రీ హనుమాన్ వినాయక ఉత్సవ కమిటీ తరపున, గ్రామం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,శ్రీ హనుమాన్ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు,గ్రామ యువకులు, చిన్నారులు,భక్తులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ కోతలపై రైతుల నిరసన

- **కలకొండ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి**

**వనపర్తి,సెప్టెంబర్ 15 (ప్రజాక్షేత్రం):** వ్యాపారవేత్త కలకొండ సత్యం ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మంగళవారం 33వ వార్డులోని ఆయన నివాసానికి వెళ్లారు. సత్యం కుమారుడు శ్రీనివాసులు, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

**స్వగృహంలో గణపతి పూజ**

వినాయక చవితి సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తన స్వగృహంలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, గౌడ్ నాయక్, మంద రాము తదితరులు పాల్గొన్నారు.

**విద్యుత్ కోతలపై రైతుల నిరసన**

విద్యుత్ కోతలను నిరసిస్తూ వనపర్తి మండలం చందాపూర్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు వంటావార్పు నిర్వహించారు. చందాపూర్, మల్లాయపల్లి, దత్తాయపల్లి, పెద్దతండా గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు గట్టు యాదవ్ రైతులకు మద్దతు తెలిపారు.

రైతులు మాట్లాడుతూ 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్నా 7, 8 గంటలు మాత్రమే వస్తోందని, సమయపాలన లేకుండా కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఈ చంద్రశేఖర్, డీఈ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. దాదాపు గంటన్నర విద్యుత్ కోత ఉన్నది వాస్తవమేనని డీఈ శ్రీనివాసులు తెలిపారు. రైతులు 24 గంటల విద్యుత్ కోరుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,రైతులు పాల్గొన్నారు.



# భూత్పూర్ అభివృద్ధికి సమష్టి కృషి చేయాలి

- **ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత.**
- **అధికారులకు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆదేశం.**
- **ఏడాదిలో ఆధునిక మున్సిపల్ కార్యాలయం పూర్తి చేస్తాం.**
- **హైవే సర్వీస్ రోడ్లు, తండాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి.**

**భూత్పూర్ సెప్టెంబర్ 15 (ప్రజాక్షేత్రం):** భూత్పూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సమష్టిగా పనిచేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి జిఎంఆర్ సూచించారు. భూత్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజలకు అందుతున్న మౌలిక వసతులు,వివిధ సమస్యలపై కౌన్సిలర్లు,అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.

సమావేశంలో పలు అభివృద్ధి, పరిపాలనా అంశాలపై చర్చించి వివిధ తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఆయా వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కౌన్సిలర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా, డ్రైనేజీ, మిషన్ భగీరథ తాగునీటి సరఫరా,పారిశుధ్యం, ఫాగింగ్, రోడ్లు తదితర మౌలిక వసతుల సమస్యలను వివరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా,వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**విద్యుత్, డ్రైనేజీ సమస్యలకు తక్షణ పరిష్కారం**

మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, లైన్లు ఏర్పాటు చేయడంతో పాటు ఇతర సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ,మురుగు నీటి పారుదల, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి కుటుంబానికి తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే గుర్తించి పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు.వర్షాకాలంలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు మున్సిపాలిటీ పరిధిలో ఫాగింగ్ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు.

**ఏడాదిలో ఆధునిక మున్సిపల్ కార్యాలయం**

భూత్పూర్ మున్సిపాలిటీకి నూతన కార్యాలయ భవన నిర్మాణానికి సంబంధించిన నమూనాను ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పరిశీలించారు. మున్సిపాలిటీకి అవసరమైన అన్ని సౌకర్యాలతో ఆధునిక కార్యాలయ భవనాన్ని నిర్మించి సంవత్సర కాలంలో నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు.



**హైవే సర్వీస్ రోడ్లపై ప్రత్యేక దృష్టి**

భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి నిర్వహణకు సంబంధించి ఎల్ &టి సంస్థ ప్రతినిధులతో ఎమ్మెల్యే చర్చించారు. హైవే సర్వీస్ రోడ్లలో అవసరమైన చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. హైవే పక్కన ఉన్న సైడ్ డ్రైన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, వాటికి అవసరమైన మరమ్మతులు చేపట్టి మెరుగుపరచాలని సూచించారు.

ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హైవే పరిధిలోని మౌలిక వసతులను మెరుగుపరచాలని ఎల్ &టి ప్రతినిధులను ఎమ్మెల్యే కోరారు.

**తండాల అభివృద్ధికి ప్రాధాన్యత**

భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని తండాల అభివృద్ధిపైనా ఎమ్మెల్యే ప్రత్యేకంగా చర్చించారు. తండాల్లో ప్రజలకు అవసరమైన రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, పారిశుధ్యం తదితర మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ప్రజల నుంచి వచ్చే సమస్యలను సమావేశాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని, అధికారులు-ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.

భూత్పూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు తనవంతు పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, అధికారులు, కౌన్సిలర్లు,సంబంధిత శాఖల అధికారులు, కోఆప్షన్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సారపాకలో గోమాంసం విక్రయాలు.. అధికారుల నిఘా ఏది?

- **అనుమతులు ఉన్నాయా.. నిబంధనలు పాటిస్తున్నారా?**
- **పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణపై తనిఖీలు చేయాలని స్థానికుల డిమాండ్**

**బూర్గంపాడు,సెప్టెంబర్ 16(ప్రజాక్షేత్రం):** బూర్గంపాడు మండలంలోని సారపాక,గాంధీనగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న మాంసం విక్రయ కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఆయా కేంద్రాలకు సంబంధిత అనుమతులు ఉన్నాయా? ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు జరుగుతున్నాయా? పారిశుద్ధ్య ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే అంశాలపై స్థానికుల్లో చర్చ జరుగుతోంది.మాంసం విక్రయ కేంద్రాల నిర్వహణకు సంబంధించి స్థానిక సంస్థల అనుమతులు, ఆహార భద్రతా నిబంధనలు, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

**పండుగల వేళ ప్రత్యేక పర్యవేక్షణ అవసరం**

పండుగలు,పర్వదినాల సమయంలో ప్రజల మనోభావాలు, శాంతిభద్రతలు,సామాజిక సామరస్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు పర్యవేక్షణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులకు తావులేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి**

జనావాసాల మధ్య మాంసం విక్రయ కేంద్రాలు నిర్వహించే ప్రాంతాల్లో వ్యర్థాల నిర్వహణ కీలకంగా మారింది. మాంసం వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా, నిబంధనల ప్రకారం వాటిని తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.అపరిశుభ్రత, దుర్వాసన వంటి సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**గో సంరక్షణ సంస్థల నుంచి డిమాండ్**

గోవుల వధ, మాంసం విక్రయాలకు సంబంధించి అమలులో ఉన్న చట్టాలు, నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని గో సంరక్షణ సంస్థలు, హిందూ సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు జరుగుతున్నట్లు అధికారుల తనిఖీల్లో తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**శాఖల సమన్వయంతో తనిఖీలు చేయాలి**

పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, పశుసంవర్ధక, ఫుడ్ సేఫ్టీ తదితర సంబంధిత శాఖలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.ఎన్ని కేంద్రాలకు అనుమతులు ఉన్నాయి? నిబంధనలు పాటిస్తున్నారా? ఇప్పటివరకు ఎన్ని తనిఖీలు జరిగాయి? ఉల్లంఘనలు గుర్తించారా? అనే వివరాలను అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

**తనిఖీలతోనే వాస్తవాలు వెలుగులోకి**

ఈ వ్యవహారంలో వివాదాలకు తావులేకుండా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనల ప్రకారం కార్యకలాపాలు జరుగుతున్నట్లయితే ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.




# అంబేద్కర్ యూత్ గణేష్ విగ్రహానికి కాగుల కుమార్ యాదవ్ సహకారం..!

**తలకొండపల్లి, సెప్టెంబర్ 15(ప్రజాక్షేత్రం)** చుక్కాపూర్ గ్రామానికి చెందిన అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ గుడి దగ్గర నెలకొల్పిన గణేష్ విగ్రహానికి చుక్కాపూర్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెంట్ సర్పంచ్ కాగుల కుమార్ యాదవ్ 6000 రూపాయలు సహకారం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొప్పు మల్లేష్, కొప్పు శ్రీశైలం, గుద్దటి రాజ్ కుమార్, కొప్పు నవీను, కొప్పు ప్రసాదు, కాలువ సిద్ధార్థ, కొప్పు గణేశు, కాలూర్ శివ, కాలురీ వంశి, కొప్పు శివ, కొప్పు రాఘవేందర్, కాకునూరి ధోని, రాకేష్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.



# కాలనీ సమస్యలపై త్వరలో మీటింగ్:కేఎల్ఆర్

- **గుమ్మడవెల్లి తండాలో తాగునీటి కోసం స్థానికుల వినతి**
- **పార్టీ పదవులన్నీ త్వరలో భర్తీ చేస్తాం.**

**మహేశ్వరం సెప్టెంబర్ 15(ప్రజాక్షేత్రం):** సామాజిక న్యాయం పాటిస్తూ సొసైటీ బ్యాంకుల పదవులు తుక్కుగూడ కార్యాలయంలో కాంగ్రెస్ నేతలతో భేటీ పార్టీ పదవులు, సొసైటీ బ్యాంకు చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల్లో సామాజిక న్యాయం పాటించాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నేతలకు ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సూచించారు. తుక్కుగూడ కార్యాలయంలో కాంగ్రెస్ నేతలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కెఎల్ఆర్ మాట్లాడుతూ... ప్రజా పాలన, సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన విధానంతోపాటు... పార్టీ సీనియర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు దామాషా ప్రకారం పదవులు కల్పించాలని కోరారు.

**కాలనీలసమస్యలపై త్వరలో సమావేశం**

బడంగ్ పేట, నాదర్ గుల్, బాలాపూర్, మీర్‌పేట, జిల్లెలగూడ, ప్రశాంతిహిల్స్ డివిజన్లలో నెలకున్న కాలనీల సమస్యలపై త్వరలోనే అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తానని లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు తీర్చేందుకు ఆయా శాఖల అధికారులతో కాలనీల ప్రెసిడెంట్స్, ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నేతలతో త్వరలో ప్రత్యేక సమావేశం ఉంటుందని చెప్పారు.

**గుమ్మడవెల్లి తండాలో మంచినీటి సమస్యకు పరిష్కారం**

కందుకూరు మండలం గుమ్మడవెల్లి తండాలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులతో కేఎల్ఆర్. ఫోన్లో మాట్లాడారు. రోడ్లు వెడల్పు, మరమ్మతులకు విద్యుత్ స్థంబాలు అడ్డంకిగా మారయని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కిచ్చెన్నగారి దృష్టికి తెచ్చారు. అధికారులు సమన్వయం చేసుకుని వెంటనే గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# ఎన్కేపల్లిలో గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం

- **103 మందికి ఉచిత కంటి పరీక్షలు.**
- **స్థానిక సర్పంచ్ చేల్క స్వరూప వెంకటేష్.**
- **బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సి. రవీందర్ రెడ్డి.**

**యాలాల సెప్టెంబర్ 15(ప్రజాక్షేత్రం):** వికారాబాద్ జిల్లా యాలాల మండలం ఎన్కేపల్లి గ్రామంలో గ్రామ స్థానిక సర్పంచ్ చేల్క స్వరూప వెంకటేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సి. రవీందర్ రెడ్డి సహకారంతో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఈ శిబిరంలో 103 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 54 మందికి ఉచితంగా కంటి అద్దాలు అవసరం, 14 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు ప్రముఖ పేరుపొందిన పుష్పగిరి కంటి ఆసుపత్రి సికింద్రాబాద్లో ఉచితంగా కంటి ఆవరించి చేయించడం జరుగుతుందని డాక్టర్, నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా సి. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరూ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామ ప్రజలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందించేందుకు శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ పుష్పగిరి కంటి ఆసుపత్రి నివాళులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యశ్వంత్, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.



## మావోయిస్టు డివిజన్ కమిటీ సభ్యురాలు
# నక్కా సుశీల రాణి లొంగుబాటు



- నిజామాబాద్ సీపీ ముందు లొంగిపోయిన నక్కా సుశీల
- తెలంగాణలో మావోయిస్టులు పూర్తిగా దెబ్బతిన్నారన్న పోలీసు అధికారులు
- మరో ముగ్గురు తెలంగాణ నేతలే అజ్ఞాతంలో ఉన్నారని వెల్లడి

**నిజామాబాద్ సెప్టెంబర్ 15(ప్రజాక్షేత్రం):**

చారిత్రాత్మక పరిణామంతో 2026 సంవత్సరం తెలంగాణ పోలీసు శాఖ పోరాటంలో ఒక కీలక మలుపుగా మారింది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబి), గ్రేహౌండ్స్, జిల్లా పోలీసుల సమన్వయంతో సాగించిన వ్యూహాత్మక చర్యల వల్ల ఈ ఏడాది ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో మొత్తం 266 మంది అజ్ఞాత మావోలు హింసామార్గాన్ని వీడి లొంగిపోయారు. ఈ ఏడాది లొంగిపోయిన వారిలో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు, 12 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, 25 మంది డివిజనల్ కమిటీ కార్యదర్శులు/సభ్యులు ఉన్నారని పోలీసులు తెలిపారు. వీరితో పాటు 94 మంది ఏరియా కమిటీ సభ్యులు, 131 మంది సాధారణ మావోయిస్టులు లొంగిపోవడంతో పార్టీ నెట్‌వర్క్ అగ్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు పూర్తిగా ఛిన్నాభిన్నమైందని వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణకు చెంది బయటి రాష్ట్రాల్లో పనిచేస్తున్న ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు (గణపతి), జడె రత్నబాయి (సుజాత), వార్త శేఖర్ (మంగు) అనే ముగ్గురు నేతలు మాత్రమే అజ్ఞాతంలో మిగిలారని పోలీసులు ధ్రువీకరించారు. సుశీల రాణి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ పూర్తిగా బలహీన పడిందని... అజ్ఞాతంలో ఉన్న మిగిలిన వారందరూ తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న లొంగుబాటు, పునరావాస విధానాన్ని ఉపయోగించుకుని సాధారణ జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

## రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యం.

- డి ఎఫ్ ఎ సి వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే మేఘారెడ్డికి కృతజ్ఞతలు.

**వనపర్తి,సెప్టెంబర్ 15 (ప్రజాక్షేత్రం):**

జిల్లా రైతు సలహా కమిటీ వైస్ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించినందుకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి విట్ట సూర్యచంద్రారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.హైదరాబాద్ మాదాపూర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మేఘారెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.
వైస్ చైర్మన్‌గా నియమితులైన అనంతరం తొలిసారి ఎమ్మెల్యేను కలిసిన సూర్యచంద్రారెడ్డి పుష్పగుచ్ఛం అందజేశారు.తనపై నమ్మకం ఉంచి జిల్లా రైతు సలహా కమిటీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించడంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేక చొరవ, సహకారం కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.
రైతుల కోసం పనిచేస్తా
తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానని సూర్యచంద్రారెడ్డి తెలిపారు. జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని,వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.
రైతులకు అందాల్సిన ప్రభుత్వ పథకాలు, సౌకర్యాలు సక్రమంగా అందేలా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి చరణ్‌రెడ్డి,తిరుపతిరెడ్డి, సర్పంచ్ లింగం,వెంకటేష్,ఆర్యభవన్ శ్రీను,కొత్తకోట చీర్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## మందుల స్టాక్ ను రోజువారీగా సూచిక బోర్డు మీద రాయాలి

- వైద్యం కోసం వచ్చే రోగులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలి
- రోగుల ఇబ్బందుల దృష్ట్య డ్యూటీ డాక్టర్లు ఆసుపత్రిలో ఉండాలి.

**జహీరాబాద్,సెప్టెంబర్ 15 (ప్రజాక్షేత్రం):**

రోగుల ఇబ్బందుల దృష్ట్య ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండాలని కోహిర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ హన్నన్ జావీద్ అన్నారు. మంగళవారం నాడు కోహిర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మున్సిపల్ వైస్ చైర్మన్ హన్నాన్అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సాయంత్రం వేళల్లోనూ ఓపీ సేవలు అందించాలని ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. అందుబాటులో ఉన్న మందుల వివరాలను బోర్డుపై ప్రదర్శించాలని, రోగులతో వైద్యులు, సిబ్బంది మర్యాదగా, సానుభూతితో వ్యవహరించాలని సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజని సీసీ కెమెరాల ఏర్పాటు, అదనపు బస్సు సర్వీసుల పునరుద్ధరణను కోరారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని అబ్దుల్ హన్నాన్ జావేద్ హామీ ఇచ్చారు. సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ ముజఫర్ హుస్సేన్, మున్సిపల్ కౌన్సిలర్ కుమారి ఎన్ శిరీష రాణి,సామాజిక కార్యకర్త మహమ్మద్ ఫిర్దౌస్ సర్వర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మరకత శివాలయ సన్నిధిలో గద్దర్ కుమార్తె, గుమ్మడి వెన్నెల

**శంకర్‌పల్లి సెప్టెంబర్ 15(ప్రజాక్షేత్రం)**




శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల ప్రఖ్యాతిగాంచిన పదకొండవ శతాబ్దమునాటి శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివలింగాన్ని గద్దర్ కుమార్తె, రాష్ట్ర సాంస్కృతిక సారథి కార్పొరేషన్ చైర్పర్సన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల కుటుంబ సభ్యులతో కలిసి, స్వామివారికి ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సాయిశివ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, స్వామివారి విశిష్టతను వివరించారు. మరకత శివలింగాన్ని దర్శించుకోవడం ఎంతో ఆధ్యాత్మికమైన అనుభూతిని కలిగించిందని వెన్నెల తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మధోల్ల మల్లికార్జున్, ఆలయ కమిటీ చైర్మన్ కుమార్ యాదవ్ వెన్నెల దంపతులను స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


# వాడవాడలా కొలువైన గణనాథుడు

- భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు
- ముస్తాబైన మండపాలు.. కనువిందు చేస్తున్న విద్యుత్ దీపాలంకరణలు
- ఉత్సవాలకు సర్వం సిద్ధం చేసిన నిర్వాహకులు

**యువతలో వెల్లివిరుస్తున్న ఉత్సాహం...గ్రామాల్లో పండుగ శోభ**







పెద్దేముల్, సెప్టెంబర్ 15(ప్రజాక్షేత్రం): విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు వాడవాడలా కొలువుదీరాడు.వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దేముల్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గణనాథుడి విగ్రహాలను సోమవారం ఘనంగా ప్రతిష్ఠించారు.భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ గణపయ్యను కొలుస్తున్నారు.దీంతో మండలంలోని పల్లెలన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.వినాయక చవితి నేపథ్యంలో కొద్ది రోజులుగా మండపాల ఏర్పాట్లు, అలంకరణలు, విద్యుత్ దీపాల అమరిక తదితర పనులతో సందడిగా కనిపించిన గ్రామాలు.. సోమవారం గణనాథుడి ప్రతిష్ఠతో పండుగ కళను సంతరించుకున్నాయి. వివిధ ఉత్సవ కమిటీలు తమ తమ ప్రాంతాల్లో ఆకట్టుకునే రీతిలో మండపాలను ఏర్పాటు చేసి, రంగురంగుల విద్యుత్ దీపాలు, పుష్పాలు, ప్రత్యేక అలంకరణలతో ముస్తాబు చేశారు.

**మండపాల్లో ప్రత్యేక ఆకర్షణలు**

మండపాల వద్ద ఏర్పాటు చేసిన అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వివిధ రకాల థీమ్‌లతో మండపాలను తీర్చి దిద్దడంతో పాటు గణనాథుడి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు.సాయంత్రం వేళల్లో విద్యుత్ దీపాల వెలుగుల్లో మండపాలు మరింత శోభాయమానంగా కనిపిస్తున్నాయి. భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి గణపయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

**యువతలో ఉత్సాహం.. ఉత్సవాల్లో చురుకైన భాగస్వామ్యం**

నాయక ఉత్సవాల నిర్వహణలో యువత ప్రధాన భూమిక పోషిస్తోంది. మండపాల ఏర్పాటు నుంచి అలంకరణలు,విద్యుత్ దీపాల అమరిక, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన వరకు యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.తొమ్మిది రోజుల పాటు గణనాథుడికి ప్రత్యేక పూజలు, భజనలు, భక్తి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి.

**పల్లెల్లో పండుగ సందడి**

వినాయక చవితితో పెద్దేముల్ మండలంలోని గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.చిన్నారులు, మహిళలు, యువతతో మండపాల వద్ద సందడి నెలకొంది. గణనాథుడి నామస్మరణతో పల్లెల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది.సోమవారం ఉదయం నుంచి భక్తులు మండపాలకు చేరుకుని పూజలు, నైవేద్యాలు సమర్పిస్తున్నారు.

**తొమ్మిది రోజులూ భక్తి పారవశ్యమే**

వినాయక చవితి నుంచి నవరాత్రుల వరకు గణనాథుడికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భజనలు, అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితరాలను నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా కమిటీలు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తున్నాయి.వినాయక చవితి వేడుకలతో పెద్దేముల్ మండలం భక్తి, ఆధ్యాత్మికత, ఉత్సాహం, ఆనందాల సమ్మేళనంగా మారింది.గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

# 72 వేల మందికి పీఆర్సీ కోత?

- ప్రభుత్వం పంపిన ఉద్యోగుల జాబితాలో 2004 తర్వాత నియమితులైన వారికి చోటు లేదా?
- డీఎస్సీ–2024 టీచర్లు.. గురుకుల ఉద్యోగులు.. గ్రూప్స్.. పోలీసుల్లో తీవ్ర టెన్షన్

**వికారాబాద్ బ్యూరో సెప్టెంబర్ 15(ప్రజాక్షేత్రం):**



కొత్త వేతన సవరణ కోసం రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఆశగా ఎదురుచూస్తున్న వేళ.. పీఆర్సీ విషయంలో కొత్త వివాదం తెరపైకి వచ్చింది. పీఆర్సీ కమిటీకి ప్రభుత్వం సమర్పించిన ఉద్యోగుల వివరాల్లో సుమారు 72 వేల మంది ఉద్యోగులకు సంబంధించిన వివరాలు లేవన్న సమాచారం ఉద్యోగ వర్గాల్లో ఆందోళనకు కారణమవుతోంది. ముఖ్యంగా 2004 తర్వాత నియమితులైన ఉద్యోగుల సంఖ్య జాబితాలో ప్రతిబింబించకపోవడంతో.. వారికి కొత్త పీఆర్సీ వర్తిస్తుందా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అమలు కానున్న రెండో పీఆర్సీపై ఇప్పటికే ఉద్యోగుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. పీఆర్సీ నివేదిక తుది దశకు చేరుకుంటున్న నేపథ్యంలో ఉద్యోగుల సంఖ్య, ప్రస్తుత వేతన స్కేళ్లు, ఫిట్‌మెంట్ తదితర అంశాలపై ప్రభుత్వం కమిటీకి సమర్పించిన సమాచారమే కీలకంగా మారింది. అయితే ఈ వివరాల్లో వేలాది మంది కొత్త ఉద్యోగుల ప్రస్తావన లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

**జాబితాలో ఎక్కడ? 72 వేల మంది ఉద్యోగులు!**

పీఆర్సీకి ప్రభుత్వం పంపిన జాబితాలోసుమారు 72 వేల మంది ఉద్యోగులు లేకపోవడంపై ఉద్యోగ సంఘాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. వీరిలో డీఎస్సీ-2024 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులు, గురుకుల ఉపాధ్యాయులు, గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 ఉద్యోగులు, పోలీసు కానిస్టేబుళ్లు, వైద్య సిబ్బంది, జూనియర్, పాలిటెక్నిక్ లెక్చరర్లు తదితరులు ఉన్నట్టు సమాచారం.
ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని వేతన సవరణపై సిఫార్సులు చేయాల్సిన సమయంలో.. కొత్తగా నియమితులైన ఉద్యోగుల వివరాలు లేకపోవడం వల్ల పీఆర్సీ పరిధిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**డీఎస్సీ–2024 టీచర్లలో టెన్షన్**

ఇటీవల నియమితులైన డీఎస్సీ-2024 ఉపాధ్యాయుల్లో ఈ అంశం మరింత ఆందోళన కలిగిస్తోంది. సుమారు 10 వేల మంది కొత్త టీచర్ల వివరాలు పీఆర్సీ జాబితాలో కనిపించకపోవడం చర్చకు దారితీసింది. గురుకుల ఉపాధ్యాయులు, పోలీసు కానిస్టేబుళ్లు, గ్రూప్స్ ఉద్యోగులు కూడా ఇదే పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.
“ప్రభుత్వ ఉద్యోగులంటే అందరూ ఉద్యోగులే.. నియామక తేదీ ఆధారంగా వేతన సవరణలో తేడా ఎందుకు?” అన్న ప్రశ్న ఉద్యోగ వర్గాల నుంచి వినిపిస్తోంది.

**30 శాతానికి మించి ఫిట్‌మెంట్ ఇవ్వాలి**

పీఆర్సీ కమిటీ సిఫార్సు చేయనున్న ఫిట్‌మెంట్‌పై కూడా ఉద్యోగుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుత జీవన వ్యయం, నిత్యావసర ధరల పెరుగుదల, కుటుంబాల ఆర్థిక భారం దృష్ట్యా 30 శాతానికి పైగా ఫిట్‌మెంట్ ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.
రూ.40 వేల బేసిక్ పే ఉన్న ఉద్యోగికి 30 శాతం ఫిట్‌మెంట్ లభించినా సుమారు రూ.12 వేల మేర పెరుగుతుందని, ప్రస్తుత ధరల పరిస్థితుల్లో ఈ పెంపు పెద్దగా ఉపశమనం కలిగించదని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వాదిస్తున్నారు.

**ఫిట్‌మెంట్‌పై భారీ అంచనాలు.. అంతే స్థాయిలో అనుమానాలు**

గత పీఆర్సీలను పరిశీలిస్తే కమిటీ సిఫార్సు చేసిన ఫిట్‌మెంట్‌నే ప్రభుత్వం యథాతథంగా అమలు చేసిన సందర్భాలు మాత్రమే కాకుండా.. దానికంటే ఎక్కువగా ప్రకటించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో పీకే అగర్వాల్ కమిటీ 27 శాతం ఫిట్‌మెంట్‌ను సిఫార్సు చేయగా.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం 43 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించింది.
అదేవిధంగా తెలంగాణ తొలి వేతన సవరణ కమిషన్ 2020లో 7.5 శాతం ఫిట్‌మెంట్‌ను సిఫార్సు చేసినప్పటికీ.. అనంతరం ప్రభుత్వం 30 శాతానికి పైగా ఫిట్‌మెంట్‌ను ప్రకటించింది.
దీంతో ప్రస్తుత పీఆర్సీ కమిటీ ఎంత శాతం సిఫార్సు చేసినా.. ప్రభుత్వం, ఉద్యోగ సంఘాల మధ్య జరిగే చర్చలే తుది నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయన్న అభిప్రాయం ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

**“10 శాతం సరిపోదు.. 30 శాతం కావాలి”**

ఈసారి పీఆర్సీ కమిటీ తక్కువ ఫిట్‌మెంట్ సిఫార్సు చేసే అవకాశాలపై ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. అయితే తక్కువ ఫిట్‌మెంట్‌ను అంగీకరించబోమని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేస్తున్నాయి.
మార్కెట్ ధరలు, అద్దెలు, విద్య, వైద్యం, రవాణా, నిత్యావసరాల ఖర్చులు పెరిగిన నేపథ్యంలో కనీసం 30 శాతానికి పైగా ఫిట్‌మెంట్ అవసరం అని ఉద్యోగ సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

**70 వేల మందికి న్యాయం చేయాలి**

తెలంగాణ డీఎడ్, బీఎడ్ ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధి రావుల రామ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ సమాన న్యాయం జరగాలని కోరారు. పీఆర్సీ కమిటీకి ప్రభుత్వం సమర్పించిన వివరాల్లో కొత్తగా నియమితులైన ఉద్యోగులందరినీ పరిగణనలోకి తీసుకోవాలని, టీచర్లు, పోలీసు సిబ్బంది, గ్రూప్స్ ఉద్యోగులు, గురుకుల ఉద్యోగులు సహా అర్హులైన ప్రతి ఉద్యోగికి పీఆర్సీ ప్రయోజనం అందేలా స్పష్టమైన సిఫార్సులు చేయాలని ఆయన కోరారు.

**రిపోర్టుపైనే ఉత్కంఠ**

పీఆర్సీ కమిటీ నివేదిక తుది దశకు చేరుకున్న నేపథ్యంలో.. ప్రభుత్వం సమర్పించిన ఉద్యోగుల సంఖ్య, కమిటీ పరిగణనలోకి తీసుకున్న ఉద్యోగుల సంఖ్య, కొత్తగా నియమితులైన ఉద్యోగులకు పీఆర్సీ వర్తింపుపై స్పష్టత రావాల్సి ఉంది. 72 వేల మంది ఉద్యోగుల వివరాలు నిజంగానే పీఆర్సీ లెక్కల్లో లేకపోతే.. అది కేవలం సంఖ్యల సమస్య కాదు. వేలాది కుటుంబాల వేతన భవిష్యత్తును ప్రభావితం చేసే అంశంగా మారే అవకాశం ఉంది.
అందుకే పీఆర్సీ నివేదికలో ప్రతి ఉద్యోగి పేరు.. ప్రతి కేడర్.. ప్రతి నియామక వర్గం పరిగణనలోకి తీసుకోవాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**పీఆర్సీ ఎవరికోసం? ఉద్యోగులందరికీనా.. కొందరికేనా?**

72 వేల మంది ఉద్యోగుల వివరాలపై ప్రభుత్వం, పీఆర్సీ కమిటీ స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి.

# గాజీపూర్ హైలెవల్ బ్రిడ్జి వద్ద గుంతలకు మోక్షం

- ప్రయాణికులు, విద్యార్థులు, వాహనదారులకు ఊరట
- ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆదేశాలతో గుంతలను పూడ్చివేయించిన మండల కాంగ్రెస్ నాయకులు
- 5 డంపర్ల మొరం మట్టితో గుంతల పూడ్చివేత

**పెద్దేముల్,సెప్టెంబర్ 15 ( ప్రజాక్షేత్రం):**



పెద్దేముల్ మండల పరిధిలోని గాజీపూర్ గ్రామ హైలెవల్ బ్రిడ్జి సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో ప్రయాణికులు, వాహనదారులు,విద్యార్థులు, ఉద్యోగస్తులు,ఆటో డ్రైవర్లకు కొంత ఊరట లభించింది. రోడ్డుపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మండల కాంగ్రెస్ నాయకులు గుంతలను పూడ్చే చర్యలు చేపట్టారు.గాజీపూర్ హైలెవల్ బ్రిడ్జి సమీపంలో ఏర్పడిన గుంతల్లో 5 డంపర్ల మొరం మట్టిని పోయించి,రోడ్డును చదును చేయించారు.దీంతో ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, ఆటోలు,ఇతర వాహనదారులకు ప్రయాణం కొంత సులభతరమైంది.ఈ రహదారి మీదుగా వివిధ గ్రామాల ప్రజలతో పాటు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు,ఉద్యోగస్తులు, ఆటోల్లో ప్రయాణికులు ఎక్కువ మొత్తంలో ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తుంటారు.రోడ్డుపై గుంతల కారణంగా వర్షాకాలంలో రోడ్డు మొత్తం బురదమయంగా మారిపోయి చిత్తడి చిత్తడిగా తయారై ఇబ్బందులు మరింత పెరిగేవని స్థానికులు పేర్కొన్నారు. ప్రస్తుతం గుంతలను మొరం మట్టితో పూడ్చి చదును చేయడంతో వాహనదారులకు తాత్కాలికంగా ఇబ్బందులు తొలగినట్లు తెలిపారు.

**ఎమ్మెల్యే మనోహర్ ఆదేశాలతో కాంగ్రెస్ పార్టీ నాయకుల చర్యలు**

ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఎప్పటికప్పుడు ప్రాధాన్యత ఇస్తూ వెంటనే పరిష్కరిస్తున్నారని అన్నారు.
అయితే గుంతలు పూడ్చడం ద్వారా తాత్కాలిక ఉపశమనం లభించినప్పటికీ,రహదారిపై శాశ్వత మరమ్మతులు చేపట్టి నాణ్యమైన రోడ్డును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.ముఖ్యంగా విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడకుండా సంబంధిత శాఖ అధికారులు రహదారి పరిస్థితిని పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పి.నారాయణ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షులు ఎన్.ఎల్లారెడ్డి, డీసీసీ కార్యదర్శి నసీర్,మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీణ్ కుమార్ గుప్తా,పెద్దేముల్ గ్రామ ఎంపీటీసీ విద్యాసాగర్,పెద్దేముల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కుమ్మరి సాయిలు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్లోళ్ల లాల్ రెడ్డి, పట్లోళ్ల ప్రకాష్ రెడ్డి, పట్లోళ్ల విష్ణువర్ధన్ రెడ్డి,గాజీపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి బలరాం, బి.అంజయ్య,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్లామర్ పాత్రలకంటే బలమైన కథలే ముఖ్యం..



సౌత్ సినిమా ఇండస్ట్రీలో దూసుకుపోతున్న క్యూట్ హీరోయిన్ కాయదు లోహర్ తెలుగు, తమిళ భాషల్లో వరుస సినిమాలు చేస్తూ కుర్రాళ్ల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. గతేడాది వచ్చిన 'డ్రాగన్' సినిమాతో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేసిన ఈ అమ్మడు, ఆ తర్వాత పళ్లిచట్టంబి, ఫంకీ, ఇదాయం మురళి వంటి వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను పలకరించింది. ప్రస్తుతం సౌత్‌లో తిరుగులేని క్రేజ్‌తో ఫుల్ బిజీగా గడుపుతోంది. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కాయదు తన కెరీర్ ప్లాన్స్ గురించి కీలక విషయాలు పంచుకుంది. కేవలం తెలుగు, తమిళ భాషల్లోనే కాకుండా తనకు బాలీవుడ్ నుంచి కూడా వరుసగా ఆఫర్లు వస్తున్నాయని ఆమె వెల్లడించింది. అయితే, అందరిలాగా తాను వెంటనే హిందీ ఇండస్ట్రీకి వెళ్లాలని అనుకోవడం లేదని స్పష్టం చేసింది. బాలీవుడ్‌లో అవకాశాలు వస్తున్నప్పటికీ, ప్రస్తుతం దక్షిణాదిలో తనకు లభిస్తున్న కథలు, పాత్రలు ఎంతో ఆసక్తిగా ఉంటున్నాయని తెలిపింది.

ఇక్కడ వస్తున్న వైవిధ్యమైన ప్రాజెక్ట్‌లు తనను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని, అందుకే తన ప్రయాణాన్ని సౌత్ ఇండస్ట్రీలోనే కొనసాగించాలని గట్టిగా నిర్ణయించుకున్నట్లు తేల్చిచెప్పింది. గ్లామర్ పాత్రలకంటే బలమూన కథలే ముఖ్యమని అంటోంది. తన తదుపరి చిత్రాల జాబితాలో నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'ది ప్యారడైజ్' తో పాటు, స్టార్ హీరో సూర్య సరసన నటిస్తున్న మరో భారీ చిత్రం, మంజనత్తి ఉన్నాయని సంతోషంగా చెప్పుకొచ్చింది. సాధారణంగా సౌత్‌లో మంచి గుర్తింపు రాగానే ఎవరైనా సరే బాలీవుడ్ వైపు పరుగులు పెడుతుంటారు. కానీ, కాయదు మాత్రం హిందీ ఆఫర్లను పక్కనపెట్టి మరీ టాలీవుడ్, కోలీవుడ్‌పైనే పూర్తి దృష్టి పెట్టడం విశేషం. ఆమె తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయం పట్ల నెటిజన్లు, సినీ ప్రియులు ఫిదా అవుతున్నారు. సౌత్ సినిమాలపై ఆమె చూపుతున్న ఈ అంకితభావానికి సోషల్ మీడియా వేదికగా ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.


## మూడోసారి గెలిచినప్పుడు మాత్రం సంభవం అవుతుంది



'లవ్ టుడే' సినిమాతో దర్శకుడిగా, హీరోగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ప్రదీప్ రంగనాథన్ తొలి ప్రయత్నంలోనే బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ఆ తర్వాత వచ్చిన చిత్రాలతో కూడా వరుస విజయాలను తన ఖాతాలో వేసుకుంటూ దూసుకుపోయారు. అయితే గత ఏడాది భారీ అంచనాల నడుమ విడుదలైన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నటుడిగానే కాకుండా నిర్మాతగా కూడా మారేందుకు ఆయన సిద్ధమయ్యారు. తన సొంత బ్యానర్ అయిన పీఆర్ షో ద్వారా ఒక సరికొత్త చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ చిత్రంలో టాలెంటెడ్ బ్యూటీ మమిత బైజుతో పాటు అశ్వత్ మరిముత్తు ప్రధాన జంటగా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్ కూడా విడుదల కాగా, ప్రస్తుతం షూటింగ్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి.

ఈనేపథ్యంలో.. తాజాగా, జరిగిన ఒక ప్రముఖ అవార్డు వేడుకలో పాల్గొన్న ప్రదీప్ రంగనాథన్ తన కెరీర్ ప్రయాణం, ఎదురుదెబ్బలు, విజయాల గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. జీవితంలో తొలిసారి గెలిచినప్పుడు దాన్ని అందరూ కేవలం ఒక అదృష్టం అంటారని, ఒకవేళ రెండోసారి గెలిస్తే దాన్ని యాదృచ్ఛికం లేదా లక్ అని కొట్టిపారేస్తారని చెప్పారు. కానీ, మూడోసారి కూడా గెలిచి చూపించినప్పుడు మాత్రం అది కేవలం సాధారణ విజయం కాదని, అది ఒక పెద్ద సంభవం అవుతుంది అంటూ ఆయన చెప్పుకొచ్చారు. ప్రదీప్ చెప్పిన ఈ మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. కెరీర్‌లో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకుని ఏ విధంగా గెలుపు వైపు అడుగులు వేయాలో ఆయన చెప్పిన విధానం అభిమానులను ఆకట్టుకుంటోంది.

## క్యారెక్టర్ రోల్ కోసం వెళ్లి హీరోగా.. నా కెరీర్‌కు అదే టర్నింగ్ పాయింట్



హాస్య నటుడిగా ప్రేక్షకుల్ని మెప్పించి, ఇప్పుడు కథానాయకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు కోలీవుడ్ నటుడు సూరి (Soori). ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'మండాడి' (Mandaadi). ఈ చిత్రం సెప్టెంబరు 10న విడుదలై.. తొలి నాలుగు రోజుల్లోనే బాక్సాఫీస్ వద్ద రూ.30 కోట్లు వసూలు రాబట్టి సత్తా చాటింది. ఈ సందర్భంగా తన సినీ ప్రయాణం, హీరోగా మారిన తర్వాత పెరిగిన బాధ్యతల గురించి సూరి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "ఈ సినిమా షూటింగ్ కోసం 100 రోజులకు పైగా సముద్రంలోనే గడిపాను. నా కెరీర్‌లో అత్యంత రిస్క్‌తో కూడిన మూవీ ఇదే. ఆ పాత్ర కోసం శారీరకంగా చాలా కష్టపడ్డాను. పడవలు నడపడం, సముద్రంలో భిన్నంగా ఈదడం నేర్చుకున్నాను. దర్శకుడు మతిమారన్ విజన్‌కు తగ్గట్లుగా నటించాను. గుబురు గడ్డం, పొడవాటి జుట్టుతో నన్ను తెరపై చూసి ప్రేక్షకులు కూడా ఆశ్చర్యపోయారు. ఈ సినిమాలో నా డ్యాన్స్‌కు కూడా మంచి ప్రశంసలు దక్కాయి"నాలో ఒక హాస్య నటుడినే కాకుండా ఒక భిన్నమైన నటుడిని గుర్తించింది మాత్రం దర్శకుడు వెట్రిమారన్. ఆయన తెరకెక్కించిన 'విడుతలై' (తెలుగులో 'విడుదల') సినిమా నా కెరీర్‌కు టర్నింగ్ పాయింట్. ఆ సినిమాతో నా ఇమేజ్ పూర్తిగా మారిపోయింది. మొదట ఆ సినిమాలో నేను ఓ క్యారెక్టర్ రోల్ కోసం వెళ్లాను. కానీ ఆయన నన్ను హీరోని చేశారు"""హీరోగా మారిన తర్వాత నాపై బాధ్యత మరింత పెరిగింది. నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిన అభిమానులను నేను ఎంతో గౌరవిస్తాను. వారి అంచనాలకు తగ్గట్లుగా కథలను ఎంచుకోవాలనుకుంటున్నాను. మన గతాన్ని మర్చిపోకుండా, అహంకారానికి పోకుండా ఉంటే.. సినిమా మనల్ని ఎప్పుడూ కాపాడుతుంది. కొత్త, పాత దర్శకులతో కలిసి పనిచేయడానికి నేను ఎప్పుడూ సిద్ధంగా ఉన్నాను" అని సూరి చెప్పుకొచ్చారు. సముద్రతీర మత్స్యకారుల జీవితాలు, సంప్రదాయ పడవ పందేల నేపథ్యంలో తెరకెక్కిన 'మండాడి' చిత్రంలో సూరి సరసన మహిమా నంబియార్ నటించారు. సుహాస్, సత్యరాజ్, మిథున్ జయశంకర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

## విడుదలకు సిద్ధమైన 'డార్క్ చాక్లెట్' సినిమా..



టాలీవుడ్ టాలెంటెడ్ నటి బిందు మాధవి, యంగ్ హీరో విశ్వేదేవ్ రాచకొండ ప్రధాన జంటగా నటిస్తున్న ఆసక్తికరమైన చిత్రం 'డార్క్ చాక్లెట్'. వైవిధ్యమైన కథాంశాలతో ప్రేక్షకులను అలరిస్తున్న ప్రముఖ నిర్మాణ సంస్థలు వాల్తేర్ ప్రొడక్షన్స్, స్పిరిట్ మీడియా బ్యానర్స్‌పై హేమశ్రీ రాళ్ళపల్లి, టాలీవుడ్ స్టార్ హీరో రానా దగ్గుబాటి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గతంలో ప్రశంసలు అందుకున్న 'పరేషాన్', '35 చిన్న కథ కాదు' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి ప్రతిభావంతుడైన దర్శకుడు శశాంత్ శ్రీవాస్తవ దర్శకత్వం వహించారు. విభిన్నమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు టాలీవుడ్ సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన నిర్మాణానంతర కార్యక్రమాలు అన్నీ పూర్తి కావచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా, చిత్రబృందం ప్రేక్షకులకు ఒక గుడ్ న్యూస్ చెబుతూ సినిమా విడుదలకు పూర్తిగా సిద్ధమైనట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని నవంబర్ 13న అత్యంత గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ ప్రకటనతో పాటు ఒక ఆకర్షణీయమైన కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఆ పోస్టర్ సినిమాపై

## ఇప్పటికీ అలాంటి ప్రేమకథలో నటించలేదు

దక్షిణాది నుంచి ఉత్తరాది వరకు భాషలతో సంబంధం లేకుండా పలు వైవిధ్యమైన చిత్రాలలో తనదైన నటనతో సినీ ప్రియుల్ని మెప్పించింది అందాల తార రకుల్ ప్రీత్‌సింగ్. ఇప్పుడామె దీపావళికి విడుదల కానున్న 'రామాయణ' చిత్రంలో శూర్పణఖగా థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్... కెరీర్‌లో ఇప్పటి వరకు భావోద్వేగాలు నిండిన ప్రేమకథలోనే నటించలేదంటూ తదుపరి చిత్రాల విషయంలో ఆసక్తి కలిగిన జానర్ల కబుర్లని పంచుకుంది. ''నేను ఇప్పటి వరకు పూర్తి స్థాయి, మనసుని హత్తుకునే ప్రేమకథలో నటించలేదు. ఎమోషనల్ రొమాంటిక్ డ్రామాలో పాత్రను పోషించడం నాకు చాలా ఇష్టం. పీరియాడికల్ చిత్ర నేపథ్యం, హారర్ జానర్లలోనూ భాగం కాలేదు. నేను చేయనివి ఇంకా చాలా ఉన్నాయి. ఆ జానర్లతో కూడా విభిన్న ప్రయోగాలు చేయాలని ఉంది. ఇప్పటి వరకు నేను చేసిన పాత్రలకు భిన్నంగా.. నటిగా నన్ను సవాలు చేసుకుని మనసుకు ఉత్తేజం



## హారర్ థ్రిల్లర్ ఆగింది.. సస్పెన్స్ థ్రిల్లర్ వస్తోంది..

ట్రైలర్‌తోనే ఆసక్తిని పెంచిన హారర్ థ్రిల్లర్ '418'. (418 the film) కీర్తన్ గౌడ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల ప్రధాన పాత్రలు పోషించారు. ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం, తెలుగులో మైత్రీ మూవీ మేకర్స్ విడుదల చేస్తుండటంతో ఆసక్తి నెలకొంది. సెప్టెంబరు 18న విడుదల కావాల్సిన ఈ మూవీ ఇప్పుడు వాయిదా పడింది. ఈ మూవీని వివిధ భాషల్లో విడుదల చేయాలని నిర్ణయించుకున్నామని, అందుకే ప్రస్తుతానికి '418'ను వాయిదా వేస్తున్నట్లు మైత్రీ మూవీ మేకర్స్ తెలిపింది.

**థ్రిల్ పంచేలా 'ఇమ్మోర్టల్'..**

సంగీత దర్శకుడిగా వరుస సినిమాలు చేస్తున్న జీవీ ప్రకాశ్ కుమార్ నటుడిగానూ అలరిస్తున్నారు. ఇటీవల తమిళంలో ఆయన నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'ఇమ్మోర్టల్' (immortal movie) 'నాకు మరణం లేదు' అనేది ఉపశీర్షిక. కయాదు లోహర్ కథానాయిక. మారియప్పన్ చిన్నా దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా సెప్టెంబర్ 19న (gv prakash immortal movie release date) తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే తమిళంలో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఫర్వాలేదనిపించింది. సాంకేతికంగా సినిమా మరో స్థాయిలో ఉందని ముఖ్యంగా వీఎఫ్ఎక్స్, జీవీ ప్రకాశ్ కుమార్ నటనను ప్రేక్షకులు మెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నట్లు వినాయకచవితి సందర్భంగా చిత్ర బృందం తెలిపింది. అంతేకాదు, ట్రైలర్‌ను కూడా విడుదల చేసింది. ఓ వైవిధ్యమైన కథతో థ్రిల్, రొమాంటిక్ ఎలిమెంట్స్‌ను మిళితం చేసి సినిమాను తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.






## కమలా రెడ్డిగా రమ్యకృష్ణ.. ఫస్ట్‌లుక్ విడుదల

నటి రమ్యకృష్ణ మరో పవర్‌ఫుల్ పాత్రతో ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు. మంచు మనోజ్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న 'డేవిడ్ రెడ్డి'లో (David Reddy) ఆమె కమలా రెడ్డి పాత్రలో కనిపించనున్నారు. నేడు ఆమె పుట్టినరోజు సందర్భంగా టీమ్ పవర్‌ఫుల్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకుంది. ఈ లుక్ సినిమాలో ఆమె పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో చెబుతోందని మంచు మనోజ్ పోస్ట్ పెట్టారు. ఆమెతో (Ramya krishna) కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు.

హనుమా రెడ్డి దర్శకత్వంలో రానున్న ఈ సినిమాలో మారియా ర్యాబోషాప్కా కథానాయికగా కనిపించనున్నారు. 1897, 1920ల మధ్య బ్రిటిష్ కాలం నాటి నేపథ్యంలో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఈ ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో సముద్రఖని, రమ్యకృష్ణ కీలక పాత్రలు పోషిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది.



Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394